ప్రజాశక్తి
శనివారం 23 మార్చి 2024 8 పేజీలు
ప్రకాశం బాపట్ల

డ్రగ్స్ మాఫియాలో పాత్ర ఉందంటూ..

'సత్య'పై అసత్య ప్రచారం

కొండపి ఎమ్మెల్యే డాక్టర్ స్వామి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విశాఖపట్టణంలో దొరికిన డ్రగ్ మాఫియాలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి దామచర్ల సత్య పాత్ర ఉందని వైసిపి సోషల్ మీడియా అసత్యాలు ప్రచారం చేస్తోందని కొండపి శాసనసభ్యులు డాక్టర్ డిబివి స్వామి తెలిపారు. దామచర్ల సత్య టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పదవికి రాజీనామా చేసినట్లు నకిలీ పత్రాన్ని సృష్టించి వైసిపి సోషల్ మీడియాలో ప్రచారం చేయటం ప్రభుత్వ పతనానికి నాంది అని తెలిపారు. ఓడిపోతామనే అభద్రతా భావంతో తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నందుకు సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, వైసిపి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జిగా దామచర్ల సత్య అక్కడ వైసిపిని అంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో కలిసి కృషి చేస్తున్నారన్నారు. ఇటువంటి తప్పుడు కథనాల ద్వారా దామచర్ల సత్యపై వైసిపి బురద చల్లే ప్రయత్నం మానుకోవాలన్నారు. వైసిపి సోషల్ మీడియా దిగజారి దామచర్ల సత్యపై అసత్య ప్రచారం చేయటాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తప్పుడు వార్తలు ప్రచారం చేయటం వైసిపి పతనాన్ని అంగీకరించినట్లేనని, వీటిని మానుకోవాలని ఎమ్మెల్యే స్వామి హితవు పలికారు.

బాధిత విద్యార్థిని పరామర్శిస్తున్న ఆంధ్రా మాల్యాద్రి

దళిత విద్యార్థిపై దాడి చేసిన లెక్చరర్‌పై కఠినచర్యలు తీసుకోవాలి

కెవిపిఎస్ డిమాండ్

2లో

భూములు తీసుకున్నారు..

హామీలు మరిచారు..!

- నాలుగేళ్లు కావస్తున్నా పట్టించుకోని అధికారులు
- ఆవేదనలో ప్రభుత్వ వైద్య కళాశాల భూ నిర్వాసితులు..!

నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల

ప్రజాశక్తి-మార్కాపురం

అప్పట్లో తియ్యని మాటలు చెప్పారు... ఆరోగ్యపరంగా అందరికీ ప్రయోజనం కలుగుతుందనుకున్నారు... ప్రజా ప్రతినిధులు, అధికారుల హామీలపై గట్టి నమ్మకం పెట్టుకున్నారు... ప్రభుత్వ వైద్య కళాశాల నిరాణం కోసం... ఖరీదైన భూములను సైతం వదులుకున్నారు..! ఆ భూమిలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం జరుగుతోంది. ఖరీదైన భూములు త్యజించిన వారికి మాత్రం ఇచ్చిన హామీలు అమలు కోసం పాలకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది..!!

మార్కాపురం కేంద్రంగా ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.475 కోట్ల వ్యయంతో నిర్మాణం చేయాలని తలపెట్టింది. అందుకోసం 52 ఎకరాల భూమి అవసరమని అధికారులు తేల్చారు. ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి జాతీయ రహదారి-565 ఆనుకుని ఉన్న రాయవరం సమీపంలో అనువైనదిగా గుర్తించారు. అక్కడ ప్రభుత్వ భూమి ఉంది. దానికి తోడుగా మరో 13 ఎకరాల భూమి అవసరమైంది. ఆ భూమికి సంబంధించిన రైతులతో మాట్లాడారు. ప్రభుత్వ వైద్య కళాశాల కోసం త్యాగం చేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అక్కడి రైతులను చిన్నగా ఒప్పించగలిగారు. ప్రస్తుతం 52 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం జరుగుతోంది.

భూములను ఇచ్చే సమయంలో రైతులకు ఇచ్చిన హామీలపై అధికారులు నిలబడేలా కనిపించడం లేదు. ప్రజాప్రతినిధులు సైతం పలుమార్లు ఒత్తిడి చేసినా 'ఇదిగో...అదిగో..' అంటూ కాలాయాపన చేస్తూనే ఉన్నారు. నాలుగేళ్లు కావస్తున్నా భూమిని ఇచ్చిన వారికి న్యాయం చేయడంలో అధికారులు ఇంకనూ తాత్సారం చేస్తూనే ఉన్నారు. దీంతో భూమిని కోల్పోయిన బాధితుల్లో ఆవేదన నెలకొంది.

ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం కోసం ప్రభుత్వ భూమితో పాటు ఐదుగురు రైతుల నుంచి 13 ఎకరాలను తీసుకున్నారు. భూమికి బదులుగా సమీపంలో భూమి ఇస్తామని చెప్పారు. ఇచ్చిన భూమిని సాగులోకి తీసుకు వచ్చేందుకు ఎకరానికి రూ.3 లక్షల చొప్పున పరిహారంగా ఇస్తామని, దీంతో పాటు భూమిని ఇచ్చిన ఇంటికో ఉద్యోగం అదే ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇస్తామని అప్పట్లో ▶ 2లో

'శిద్దా' కోసమేనా?

- తాజా జాబితాలోనూ కనిపించని దర్శి అభ్యర్థి పేరు
- ఒంగోలు ఎంపీ అభ్యర్థిపైనా ఆలోచన చేస్తున్న అధిష్టానం
- తెలుగుదేశంలో కొనసాగుతున్న తర్జనభర్జన

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

తెలుగుదేశం పార్టీ బుధవారం నాడు విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో దర్శిలో ఎవరన్నది ప్రకటించలేదు. చీరాలలో ఎంఎం కొండయ్యయాదవ్‌తో పాటు బాపట్ల ఎంపీ అభ్యర్థిని కూడా ప్రకటించారు. దీంతో ఉమ్మడి ప్రకాశంలో దర్శి మినహా అన్ని అసెంబ్లీ స్థానాలకు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను ఖరారు చేసింది. దర్శితో పాటు ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా రంగంలో ఉన్న మాగుంట రాఘవరెడ్డి పేరు కూడా జాబితాలో రాలేదు. దీనికి కారణాలు వేరే ఉన్నట్లు చర్చ సాగుతోంది. ఆయన ఈడీ కేసుల్లో ఉన్నందున ఢిల్లీ నుంచి కొంత సమాచారం తీసుకొని స్పష్టత వచ్చాకే ప్రకటించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. అయితే రాఘవరెడ్డి ఇప్పటికే ఎంపీ అభ్యర్థిగా ప్రచారంలో ఉన్నారు. అధికారిక ప్రకటన ఒక్కటే మిగిలింది. రేపోమాపో ఆయన పేరు ప్రకటిస్తారని భావిస్తున్నారు. దీనిపై ఎటువంటి సందేహాలు లేవు. దర్శి విషయంలోనే ఇంకా కసరత్తు సాగుతోంది. ఇక్కడ మాజీ మంత్రి శిద్దా రాఘవరావు రాక కోసమే అధినేత చంద్రబాబు ఎదురుచూస్తున్నట్లు సమాచారం. శిద్దా నిర్ణయం కోసం వేచి ఉన్నారు. ఆయన కూడా ఒకటీరెండ్రోజుల్లో సానుకూల నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. శిద్దా రాఘవరావు దర్శిలో పోటీకే సిద్ధమవుతున్నట్లు సమాచారం. పార్టీకి ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ప్రస్తుతం ఆయన వైసిపిలోనే ఉన్నారు. పార్టీని వీడి బయటకు రావాల్సి ఉంది. అందుకే టిడిపి తాజా జాబితాలోనూ పేరు ప్రకటించకుండా పెండింగ్‌లో ఉంచినట్లు చెబుతున్నారు. దర్శి నుంచి చాలా మంది నేతలు టిక్కెట్టు కోసం ప్రయత్నాల్లో ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే మద్దిశెట్టి కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంకా బాచిన కృష్ణచైతన్య, ▶ 2లో

తెలుగుదేశం పార్టీ

చీరాల అభ్యర్థిగా కొండయ్య

ఎట్టకేలకు ఖరారు చేసిన పార్టీ అధిష్టానం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

చీరాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టిడిపి నుంచి ఎవరు పోటీ చేయనున్నారనే విషయమై చాలా కాలంగా కొనసాగుతున్న ఉత్కంఠకు పార్టీ అధినేత చంద్రబాబు శుక్రవారం తెరదించారు. అనేక రకాల సర్వేలు, తర్జనభర్జనల అనంతరం చీరాల టిడిపి ఇన్‌ఛార్జిగా ఉన్న మద్దులూరి మాలకొండయ్య (ఎంఎం.కొండయ్య) పేరును ఖరారు చేశారు. చీరాల టిడిపికి స్థానికంగా నాయకత్వం లేని దశలో రెండేళ్ల క్రితం ఎంఎం కొండయ్య పార్టీ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టారు. చీరాలలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి.. పార్టీ పిలుపిచ్చిన అన్ని కార్యక్రమాలూ విజయవంతం చేసే కృషి చేశారు. ఈ మేరకు పార్టీ అధినేత చంద్రబాబు గతంలోనే చీరాల నుంచి కొండయ్య పోటీ చేసేందుకు సమ్మతి తెలిపారు. పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేనేతలు అధిక సంఖ్యలో ఉండే మంగళగిరి నుంచి పోటీ చేస్తున్న నేపథ్యంలో అక్కడ లోకేష్ గెలుపు కోసం కృషి చేస్తున్న చేనేతలు తమకు చీరాల అసెంబ్లీ స్థానాన్ని కేటాయించాలని కోరడంతో కొండయ్యను టిడిపి అభ్యర్థిగా ప్రకటించే విషయమై జాప్యం జరిగింది. ఒక దశలో మంగళగిరికి చెందిన తిరువీధుల శ్రీనివాసరావు పేరు ఖరారయినట్లు ప్రచారం జరిగింది. సదరు శ్రీనివాసరావు కూడా చీరాల కొత్తపేటలో ఇల్లు తీసుకొని స్థానికంగా ఉన్న టిడిపి నేతలను కలవడం ప్రారంభించారు. అయితే రెండేళ్లుగా చీరాల టిడిపి ఇన్‌ఛార్జిగా ఉన్న కొండయ్యను కాదని మరొకరికి ఇస్తే అంగీకరించేది లేదని స్థానిక నేతలు, కార్యకర్తలు పలురకాలుగా నిరసనలు తెలిపారు. దీంతో పాటు కోస్తా జిల్లాల్లో యాదవ సామాజిక వర్గం వారు అధికంగా ఉన్న నేపథ్యంలో ఆ వర్గం నుంచి టిడిపి తరపున టిక్కెట్ ఇవ్వాలన్న డిమాండ్ కూడా వచ్చింది. చీరాల టిక్కెట్ చేనేతలకు ▶ 2లో

తెలంగాణా బిజెపి నేతకు

టిడిపి బాపట్ల ఎంపీ టిక్కెట్

పార్లమెంట్ అభ్యర్థిగా మాజీ ఐపిఎస్ అధికారి కృష్ణప్రసాద్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

తెలంగాణ బిజెపి అధికార ప్రతినిధిగా ఉన్న మాజీ ఐపిఎస్ అధికారి కృష్ణప్రసాద్‌ను టిడిపి అధిష్టానం తమ పార్టీ బాపట్ల ఎంపీ అభ్యర్థిగా ఖరారు చేసింది. టిడిపి తరపున బాపట్ల ఎంపీగా పోటీ చేసేందుకు పలువురి పేర్లు ప్రచారంలోకొచ్చాయి. వైసిపి నుంచి టిడిపిలో చేరిన తాజా మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, మాజీ ఐఆర్ఎస్ అధికారి దగ్గుమళ్ళ ప్రసాదరావు, టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్ఎస్ రాజు, సవరపు ప్రసాద్ బాబు పేర్లు ముందుకొచ్చాయి. బాపట్ల ఎంపీ స్థానాన్ని మాదిగ సామాజిక వర్గానికి కేటాయించడంతో ఆ వర్గానికి చెందిన దగ్గుమళ్ళ ప్రసాదరావుకు చిత్తూరు ఎంపీ టిక్కెట్ ఇచ్చారు. బాపట్ల ఎంపీ అభ్యర్థిగా చివరికి తెలంగాణాకు చెందిన బిజెపి అధికార ప్రతినిధిగా ఉన్న కృష్ణప్రసాద్ పేరును ఖరారు చేశారు.

హైదరాబాద్‌లో జన్మించిన కృష్ణప్రసాద్ 1986 బ్యాచ్ ఐపిఎస్ అధికారి. ఉమ్మడి ఏపీలో పలు జిల్లాల్లో పోలీస్ అధికారిగా పనిచేసి 2020లో ఉద్యోగ విరమణ చేశారు. ఆ తరువాత బిజెపిలో చేరారు. పార్టీ తరపున పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తెలంగాణా అసెంబ్లీ ఎన్నికల్లో కంటోన్మెంట్ బిజెపి టిక్కెట్‌ను కృష్ణప్రసాద్ ఆశించారు. కానీ టిక్కెట్ రాలేదు. వరంగల్ నుండి బిజెపి ఎంపీ టికెట్ ఆశించారు. పార్టీ అధిష్టానం టిక్కెట్ ఇస్తామన్నారు. కానీ చివరిలో ఆరూరి రమేష్ బీజేపీలో చేరడంతో ఆయనకు వరంగల్ టిక్కెట్ ఇచ్చారు. దీంతో కృష్ణప్రసాద్‌కు అటు అసెంబ్లీ ఎన్నికల్లోనూ, ఇటు పార్లమెంట్ ఎన్నికల్లోనూ బిజెపి టిక్కెట్ లభించలేదు. ఈ నేపథ్యంలో టిడిపి అధినేత చంద్రబాబును కలిసిన కృష్ణప్రసాద్ ఎట్టకేలకు బాపట్ల ఎంపీ టిక్కెట్‌ను పొందగలిగారు. తెలంగాణాలో బిజెపి నేతగా ఉన్న కృష్ణప్రసాద్‌కు టిడిపి సభ్యత్వం కూడా లేదు. ఆయన బిజెపికి రాజీనామా కూడా చేయలేదు. బిజెపి పెద్దల ఒత్తిడి మేరకు చంద్రబాబు కృష్ణప్రసాద్‌కు బాపట్ల ఎంపీ టిక్కెట్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

భూములు తీసుకున్నారు.. హామీలు మరిచారు.!

(మొదటిపేజీ తరువాయి)

అంగీకారం కుదిరింది. భూమికి భూమిని కొంత మేర ఇవ్వడం జరిగింది. ప్రభుత్వ వైద్య కళాశాల సమీపంలోని అసిస్ట్ వద్ద కొందరికి కొంతమేర భూమిని ఇచ్చారు. మరి కొంత భూమిని గోగులదిన్నె చెరువు ప్రాంతంలో ఇస్తామనడంతో రైతులు అంగీకరించలేదు. అసిస్ట్‌లో మరికొంత భూమి ఉంది. దాంట్లోనే ఇవ్వాలని రైతులు పట్టుబట్టారు. ఇచ్చిన భూమికి కొంత తగ్గినా అసిస్ట్ వద్దనే తీసుకుంటామని రైతులు చెబుతున్నారు. ఖాళీగా ఉన్న అసిస్ట్ భూమిని పూర్తి స్థాయిలో ఇచ్చేందుకు అధికారులు ఆసక్తి చూపడం లేదు. పైగా పరిహారం ఎకరానికి రూ.3 లక్షలు చొప్పున ఇంకా ఇవ్వలేదు. ఇంటికో ఉద్యోగం ఊసే ఎత్తడం లేదు. అందరి కోసం త్యాగం చేసి... జాతీయ రహదారి సమీపంలోని ఖరీదైన భూమిని ఇస్తే.. ఈ విధంగా అన్యాయం చేస్తారా.? అంటూ బాధిత రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని పదేపదే వేడుకున్నా కనికరించడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో పని జరుగుతుందని అధికార పార్టీ ఎమ్మెల్యే, మార్కాపురం వైసిపి అభ్యర్థి అన్నా వెంకటరాంబాబును ఇటీవలే బాధితులంతా కలిసి గోడు విన్నవించుకున్నారు. సబ్ కలెక్టర్ రాహుల్ మీనాతో కూడా అన్నా వెంకట రాంబాబు మాట్లాడారు. న్యాయం చేయాలని కోరారు. భూమిని కోల్పోయిన వారికి మాత్రం ఇప్పట్లో న్యాయం జరుగుతుందనే నమ్మకం సన్నగిల్లింది.!

'శిద్దా' కోసమేనా.?

(మొదటిపేజీ తరువాయి)

గొట్టిపాటి నరసయ్య కుమార్తె శ్రీలక్ష్మి, గోరంట్ల రవికుమార్, గరికపాటి వెంకట్ ప్రయత్నాల్లో ఉన్నారు. వీరెవరికీ చంద్రబాబు నుంచి స్పష్టత రాలేదు. దర్శి టిక్కెట్టు వ్యవహారం ఇప్పుడు నేరుగా చంద్రబాబే చూస్తున్నారు. ఆయన నిర్ణయంపైనే ఆధారపడినందున జిల్లానేతలు కూడా జోక్యం చేసుకోవడం లేదు. ఎవరిని పెట్టాలనేది అంతా ఆయన ఇష్టమనే చెబుతున్నారు. మరో వైపు ఎంపీ మాగుంట కూడా మాజీ మంత్రి శిద్దా రాఘవరావునే సూచిస్తున్నారు. ఈ కారణాలతో దర్శి అభ్యర్థిని ప్రస్తుతానికి పెండింగ్‌లో పెట్టారు. ఇక మాజీ మంత్రి శిద్దా రాఘవరావు కూడా ఓ ఆలోచనకు వచ్చారని సమాచారం. పోటిచేయాలనే ఆలోచనలోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని తెలుగుదేశం అధినేతకు తెలియజేయాల్సి ఉంది. పైగా వైసిపికి రాజీనామా చేయాలి. ఇవన్నీ జరగాలంటే ఒకటీరెండు రోజులు సమయం పట్టేలా ఉందని సమాచారం. ఏదేమైనా శిద్దా ఆలోచన ఏమిటన్నది ఆయనే బహిరంగంగా వెల్లడించాల్సి ఉంది. తాజా జాబితాలోనూ పెండింగ్ పెట్టడంతో శిద్దా రావడం ఖాయమనే చర్చ పార్టీ వర్గాల్లో నడుస్తోంది.

టిడిపి చీరాల అభ్యర్థిగా కొండయ్య

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వాలా.? యాదవ వర్గానికి ఇవ్వాలా.? అనే విషయమై పార్టీ అధిష్టానం తర్జనభర్జన పడింది. దీంతో సామాజిక సమీకరణలు బేరీజు వేస్తూ సర్వే జరిపారు. ఈ సర్వేల్లో అందరి కంటే కొండయ్యకే కార్యకర్తలు మొగ్గ చూపారు. ఈ సమయంలో బయటి వారిని అభ్యర్థులుగా తేవడం పార్టీకి నష్టదాయకం అని తేలడంతో పార్టి అధిష్టానం తుదిగా కొండయ్యనే అభ్యర్థిగా ఖరారు చేసింది.

ప్రజాస్వామ్యంలో ఓటే ఆయుధం

ప్రజాశక్తి-పెద్దారవీడు

పెద్దారవీడులో శుక్రవారం ఉపాధి హామీ చట్టం సిబ్బంది ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ నిర్మలదేవి మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదై, ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో మంచి వ్యక్తులను ఎన్నుకునేందుకు ఓటు ఆయుధమని పేర్కొన్నారు. ర్యాలీలో ఎంపిడిఓ రాజ్‌కుమార్, ఏపీఓ మంత్రునాయక్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, యూత్ పాల్గొన్నారు.

తక్కువ ఎత్తులో విద్యుత్ లైను

ఆందోళనలో వాహన చోదకులు

విరిగిపోయే దశలో వున్న విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని చిలకపాడు వేములపాడు గ్రామాల మధ్యనున్న విద్యుత్ లైన్ తక్కువ ఎత్తులో ఉన్నందున ఆ దారిలో లోడుతో ప్రయాణించే ట్రాక్టర్లకు, లారీలకు ఇబ్బందికరంగా మారింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని వాహన చోదకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. అలాగే గ్రామంలోని ఒకటో వార్డులో ఉన్న విద్యుత్ స్తంభం కింది భాగం విరిగిపోయే దశలో ఉంది. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే ఆ విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని వేయాల్సి ఉంది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఈ సమస్యలు వెంటనే పరిష్కరించాలని

తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ లైన్

ఎం వేములపాడు గ్రామ టిడిపి అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి: ఎస్ఈ

ప్రజాశక్తి-చీరాల

ఎండాకాలంలో కోతలకు తావు లేకుండా నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఇప్పటి నుంచి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యనారాయణరావు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన చీరాల సబ్ డివిజన్ డిఈలు, ఏఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు వేసవికాలం వచ్చిన నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు అందరూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అసౌకర్యం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే వాటిని పరిష్కరించాలని సూచించారు. విద్యుత్ బకాయిలు వసూలు చేయడంతో పాటు పోలింగ్ కేంద్రాలకు విద్యుత్ సరఫరాను సమకూర్చాలన్నారు. అనంతరం విద్యుత్ శాఖ

విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ సత్యనారాయణ

అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ జాన్ థామస్ పలువురు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు స్టిక్కర్స్ అందజేత

ప్రజాశక్తి-చీరాల

పట్టణంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం పట్టణ సీఐ శేషగిరిరావు ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ శేషగిరిరావు మాట్లాడుతూ.. చీరాల పట్టణంలో ఆటోలకు, డ్రైవర్లకు సంబంధించిన యూనిఫామ్, ఆటోలకు స్టిక్కర్స్, ఐడి కార్డులు, ఆటోస్టాండ్‌ను నిర్ణయించినట్లు తెలిపారు. ఆటో డ్రైవర్లు అందరూ కూడా ఒక ప్రాపర్‌గా ఉండేటట్లు తమ విధుల్లో సక్రమంగా యూనిఫామ్, లైసెన్సు కలిగి ఉండేటట్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే ట్రాఫిక్ అంతరాయం కలగకుండా అన్ని

డ్రైవర్లకు స్టిక్కర్లు పంపిణీ చేస్తున్న సిఐ శేషగిరిరావు

రకాలైన సూచనలు తెలియజేస్తూ వివరించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పోలీస్ వారికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు, ట్రాఫిక్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

వైసిపి ప్రచారంలో పాల్గొన్న

'ఉపాధి' టెక్నికల్ అసిస్టెంట్ సస్పెన్షన్

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

సస్పెండైన టెక్నికల్ అసిస్టెంట్ అనిల్ కుమార్ రెడ్డి

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉపాధి హామీ చట్టం టెక్నికల్ అసిస్టెంట్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. మార్కాపురం పట్టణంలో శుక్రవారం ఉదయం మార్కాపురం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక శివాజీ నగర్‌లోని నాలుగో లైన్‌లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో మార్కాపురం మండల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కుందురు అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. వైసీపీకి అనుకూలంగా పని చేస్తున్నారని అందులో భాగంగా బహిరంగ ర్యాలీలో తిరుగుతున్నట్లు టీడీపీ నాయకులు ఫొటోలు తీసి సి విజిల్ యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించకుండా అధికార పార్టీ నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొనడంపై ఆ శాఖకు చెందిన ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ప్రాజెక్టు డైరెక్టర్ బి అర్జున్‌రావు శుక్రవారం రాత్రి ఫీల్డ్ అసిస్టెంట్ కుందురు అనిల్‌కుమార్‌రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు.

Before The Hon'ble IV Addl. Motor Accidents Claims Tribunal : Nellore

M.V.O.P.No. 237 / 2023

Kosuru @ Kosuri Koteswara Rao - Claimant

Vs

1. Sunnapu Venkata Rao and 2 others - Respondents

Notice to 1st Respondent

Sunnapu Venkata Rao (Ownerof Bike) Son of **Srinu,** Resident of D.No. 11-208, Near Ramalayam, Alagayapalem, Karedu, Ulavapadu (M), Prakasam Dist.

పై నెంబరున క్లయిమెంట్ మీపై యాక్సిడెంట్ నష్టపరిహారము కోరుతూ పైన తెలిపిన కోర్టులో పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే01-04-2024** దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవల సినది లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

యు.శ్రీనివాసులు, బి.ఎ.ఎల్., బి.ఎల్.,
క్లయిమెంట్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

దస్తావేజులు పోయినవి

గుంటూరు జిల్లా, వినుకొండ టౌన్ నివాసి అయిన ఫరీద్ బాబు సన్నిధి తండ్రి: వెంకట చిన్న పుల్లారావు అను నేను, నా పేర, నా భార్య దుర్గా భవాని పేర్లపై గల రిజిష్టర్ విక్రయ దస్తావేజులు 728/2006, 824/2006, 6029/2006 మార్కాపురం మండలం రాయవరం దగ్గర 05-03-2024న పోయినవి. ఎవరికైనా దొరికిన యెడల అందజేయగలరు.

సెల్: 9441898222.

పాస్ట్‌పోర్టు పోయినది

మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారు నివాసి చిన్ని శేష వెంకట పాపయ్య తండ్రి: వెంకటేశ్వర్లునకు చెందిన ఒరిజనల్ పాస్ పోర్టు జిరాక్స్ తీయించేందుకు తీసుకువస్తుండగా నెహ్రూ బజారులో జారిపోయినది. పాస్‌పోర్టు నెం: P7512303. ఎరికైనా దొరికిన యెడల తమకు అందజేయగలరు.

చిన్ని శేష వెంకట పాపయ్య
మార్కాపురం,
సెల్: 9160915366.

పాస్ట్‌పోర్టు పోయినది

మార్కాపురం పట్టణ నివాసి కొప్పరపు శ్రీనివాసరావు నకు చెందిన ఒరిజనల్ పాస్ పోర్టు జిరాక్స్ తీయించేందుకు తీసుకువస్తుండగా పాత బస్టాండులో జారిపోయినది. పాస్‌పోర్టు నెం: K2564936. ఎరికైనా దొరికిన యెడల తమకు అందజేయగలరు.

కొప్పరపు శ్రీనివాసరావు,
మార్కాపురం,
సెల్: 9966887345.

IN THE COURT OF THE HON'BLE V TH JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT : HYDERABAD
O.S.No. 4081 0F 2022

Between :
M/s. KZ FITNESS VENTURES
A partnership firm Represented by its Partner And authorized signatory Sri. Kunal Gir S/o Pradeep Gir,
...PLAINTIFF

AND

BATTARASHETTI KALYAN KUMAR
To,
BATTARASHETTI KALYAN KUMAR
S/o AcharyuluBattarashetti, Aged : Major, Occupation : Fitness trainer / private employee R/o H.No: 1-63, East KattakrindiPalli, Pamuru Prakasham District, Andhra Pradesh- 523108
...DEFENDANT

Whereas, the above Plaintiff has filed the above suit against you for **Recovery of Amount of Rs. 3,10.000/-**and other reliefs and the matter is posted for your appearance on 23-04-2024 **at 10-30 am**, either in person or through an Advocate, failing which the suit will be heard and determined ex-parte.

(BY ORDER OF THE COURT)
SRINIVAS SURVI
Advocate
H.No 7-1-617/A/2, Ameerpet,
Hyderabad-16

ఆటోను ఢీకొన్న కారు..

- ఒకరు మృతి
- నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మరో నాలుగురికి గాయాల య్యాలయి. ఈ ఘటన పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలోని తిమ్మాపురం వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. యడ్లపాడు ఎస్ఐ కథనం ప్రకారం ... మార్టూరు సుగాలి కాలనీకి చెందిన జస్సావత్ మత్రియా నాయక్ (69) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఆయన అనారోగ్యంతో బాధపడుతుండటంతో కుటుంబసభ్యులు గుంటూరు లోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స అందించారు. ఆరోగ్యం కుదుటపడటంతో స్వగ్రామానికి ఆటోలో వస్తున్నారు. తిమ్మాపురం సమీపంలోని తిరుమల కాటన్ మిల్లు సమీపంలోకి5 వచ్చే సరికి వీరు ప్రయాణిస్తున్న ఆటోని,ప్రక్కనే వెళుతున్న స్కూటీని వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఆటో అదుపుతప్పి బోల్తాకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న మత్రియా నాయక్ తీవ్రంగా

ప్రమాదానికి కారు ఇదే..

గాయపడ్డాడు. ఆయన భార్య బోడిబాయి, కోడలు పద్మ, మనవడు వినోద్ మరొక యువకుడు శామ్యూల్,స్కూటీపై ప్రయాణిస్తున్న మరో ఇద్దరు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న హైవే పెట్రొలింగ్ ఎఎస్ఐ కొండలు, పోలీస్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు

మత్రియా నాయక్ (ఫైల్)

తరలించారు. తీవ్రంగా గాయపడిన మత్రియా నాయక్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు సర్వజన సమగ్ర వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా ఆయన మతి చెందాడు. యడ్లపాడు పోలీస్‌లు కేసు నమోదు చేశారు. మతదేహానికి పోస్ట్ మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

సుగాలి కాలనీలో విషాద ఛాయలు

గుంటూరు వైద్యశాలకు వెళ్లి చూపించుకొని తిరిగి వస్తానని వెళ్లిన మత్రియా నాయక్ రోడ్డు ప్రమాదంలో మతి చెందడంతో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. కళ్ళ ముందే జరిగిన ఘటనతో ప్రమాదం నుంచి స్వల్పగాయాలతో బయటపడిన కుటుంబసభ్యులు షాక్‌కు గురయ్యారు. వ్యవసాయ పనులు చేసుకుంటూ కాలనీ పెద్దగా ఉండే మత్రియా నాయక్ మతి తో సుగాలి కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

'తీగలేరు' సాగేనా..?

- పూర్తి కాని అప్రోచ్ కాలువలు
- ప్రజలకు తప్పని నీటి కష్టాలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

వెలుగొండ ప్రాజెక్టును విస్మరించడం, దానికి అనుబందంగా ఉన్న తీగలేరు కాలువను గాలికి వదిలేయడంపై పశ్చిమ ప్రాంత వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా కాలువ నిర్మాణంపై పాలకులు శ్రద్ధ పెట్టకపోవడంతో ప్రజలను ఆటు సాగు, ఇటు తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. యర్రగొండపాలెం నియోజక వర్గ పరిధిలోని దాదాపు నాలుగు లక్షల మందికి తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ఓవైపు కాలువ పనులు పడకేయగా ఈనెల 6న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి వెలుగొండ ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేశారు.

తీగలేరు హెడ్ రెగ్యులేటర్

నల్లమల సాగర్ ద్వారా..

నల్లమల సాగర్‌కు కష్ణా జలాలు చేరుకున్న తర్వాత తొలి దశలో తీగలేరు కాలువ ద్వారా యర్రగొండపాలెం నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందించాల్సి ఉంది. పెద్దారవీడు మండలంలో 21,900 ఎకరాలు, పెద్ద దోర్నాలలో 6,100, యర్రగొండపాలెంలో 19,800, పుల్లలచెరువులో 11,500, త్రిపురాంతకంలో ఏడు వేల ఎకరాలకు నీరందించాలనేది లక్ష్యం. వెలుగొండ ప్రాజెక్టులో అంతర్భాగంగా ఉన్నా నల్లమల సాగర్‌లోని 5.685 టీఎంసీల జలాలను యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల వాసులు వినియో గించుకునే వెసులుబాటు ఉంది. అందు కోసం ప్రభుత్వం దశాబ్దం క్రితమే పెద్దారవీడు మండలం బద్వీడు, చెర్లోపల్లి నుంచి త్రిపురాంతకం వరకూ 48.30 కిలోమీటర్లు, 12.80 మీటర్ల వెడల్పుతో కాలువను తవ్వారు. ఈ కాలువపై మొత్తం 72 వంతెనలు నిర్మించాల్సి ఉండగా, కేవలం నలభై మాత్రమే నిర్మించారు. ఇంకా 32 వంతెనలు నిర్మించాల్సి ఉంది. అయితే ఈ కాలువ కరకట్టలు బలహీనంగా ఉండటంతో వర్షాలు వచ్చినప్పుడు యర్రగొండపాలెం మండలం కొలుకుల సమీపం, పెద్దదోర్నాల మండలంలోని జమ్మిదోర్నాల సమీపంలో గండ్లు పడుతున్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతో ప్రధాన కాలువకు రంధ్రాలు పడి ప్రమాదకరంగా ఉంది. కాలువలో పిచ్చిచెట్లు పెరిగి అడవిని తలపిస్తోంది. పెద్ద దోర్నాల మండలం ఐనముక్కుల వద్ద కర్నూలు–గుంటూరు రహదారిపై పెద్ద వంతెన నిర్మించాల్సి ఉండగా, ఆ పనులు నేటికీ చేపట్టేలేదు. కొందరు పెద్దదోర్నాల వద్ద శ్రీశైలం రహదారిలో తీగలేరు కాలువ కరకట్టలపై మట్టిని తరలించి చదునుచేసి ఆక్రమణలకు పాల్పడుతున్నారు.

నిర్మాణంలో ఉన్న కాలువ పనులు

ప్రజలను మోసం చేయడమే

దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి, రైతు సంఘం కార్యదర్శి.

వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండా ముఖ్యమంత్రి ప్రారంభించి పశ్చిమ ప్రాంత ప్రజల ఓట్లు దండుకోవాలని చూస్తున్నారు. ఇది ఈ ప్రాంత ప్రజలను మోసం చేయడమే. పనులన్నీ పూర్తి చేయకుండా ప్రాజెక్టును ప్రారంభించడం వల్ల ఒరిగిందేమీ లేదు.

పూర్తి కాని అప్రోచ్ కాలువలు..

సుంకేసుల వద్ద 600 మీటర్ల సొరంగాన్ని పూర్తి చేసినప్పటికీ అప్రోచ్ కాలువను నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. హెడ్ రెగ్యులేటర్ పనులు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి. స్టాప్ లాక్, గేట్‌ను అమర్చి, హెడ్ రెగ్యులేటర్‌పై నుంచి ఆపరేట్ చేయడానికి అక్కడకు వెళ్లేందుకు రహదారి నిర్మించాల్సి ఉంది. దీన్ని ఆటవీశాఖ పరిధిలో నిర్మించాల్సి ఉండగా, ఇప్పటికీ అనుమతులు రాలేదు. ఇవన్నీ ఇలా పెండింగ్‌లో ఉండగానే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రాజెక్టును జాతికి అంకితం చేయడం పట్ల ప్రజలు పెదవి విరుస్తున్నారు.

అధికారులు స్వాధీనం చేసుకున్న ఇసుక టిప్పర్లు

ఇసుక టిప్పర్లు స్వాధీనం

ప్రజాశక్తి-కొండపి

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్లను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఒంగోలు అసిస్టెంట్ డైరెక్టర్ విజిలెన్స్ అధికారి విరేష్ కథనం ప్రకారం... జరుగుమల్లి మండలం చతుకుపాడు వద్ద పాలేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గురువారం రాత్రి విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది.దీంతో అధికారులు ఆకస్మికంగా దాడులు చేసి కామేపల్లి నుంచి వస్తున్న రెండు ఇసుక టిప్పర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. టిప్పర్లను కొండపి పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి- కొనకనమిట్ల

మండల పరిధిలోని వద్దిమడుగు గ్రామంలో శుక్రవారం దాడులు నిర్వహించిన 16 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఎస్ఐ మాధవరావు తెలిపారు. అదేవిధంగా గురువారం రాత్రి చేరెడ్డివారిపల్లెలో దాడులు నిర్వహించి 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లక్ష రూపాయలు సీజ్

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం కనుమళ్ల చెక్‌పోస్టు వద్ద ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి టీమ్ ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నీలిశెట్టి శివరామకష్ణ అనే వ్యక్తి రూ.1,00,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. అతని వద్ద నగదుకు సంబంధించిన ఎలాంటి పత్రాలు లేక పోవడంతో సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌టి టీమ్ ఇన్‌ఛార్జి టి. వేణు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు 839 మంది హాజరు

ప్రజాశక్తి-దర్శి

పదో తరగతి పరీక్షల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన గణిత పరీక్ష తాళ్లూరు మండలంలో ప్రశాతంగా ముగిసినట్లు ఎంఇఒ జి. సుబ్బయ్య తెలిపారు. మొత్తం 882 మంది విద్యార్థులకు గానూ 839 మంది పరీక్ష రాసినట్లు ఆయన పేర్కొన్నారు. తాళ్లూరు రెండు, గంగవరంలో రెండు, బొద్దికురపాడు, రెండు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

ఎఎంసి గోడౌన్లను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

ఎఎంసి గోడౌన్లు పరిశీలన

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరిలోని ఎఎంసి మార్కెట్ కార్యాలయాన్ని ఆర్‌డిఒ జాన్ ఇర్విన్ శుక్రవారం సందర్శించారు. సార్వత్రిక ఎన్నికల దష్ట్యా స్ట్రాంగ్ రూముల కోసం ఎఎంసి మార్కెట్ గోడౌన్లను ఆయన పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటుకు అక్కడ ఉన్న అవకాశాలను పరిశీలించారు. ఎఎంసి కార్యాలయంలో ఉన్న సౌకర్యాలు, పరిస్థితులను గురించి అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ భారతి

కూకట్లపల్లిలో వైద్యశిబిరం

ప్రజాశక్తి - బల్లికురవ రూరల్

ప్రజాశక్తి కథనానికి స్పందన

మండలంలోని కూకట్లపల్లిలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు శుక్రవారం వైద్యశిభిరం నిర్వహించారు. చికెన్ గునియా విజృంభించిన వార్త ప్రజాశక్తిలో గురువారం ప్రచురితమైనది. స్పందించిన వైద్య శాఖ అధికారులు శుక్రవారం గ్రామంలో కొప్పెరపాడు పిహెచ్‌సి డాక్టర్ భారతి వైద్యశిభిరం నిర్వహించారు. గ్రామంలో చికెన్ గునియా వ్యాధితో బాధపడుతున్న వారితోపాటు ఇతర వ్యాధులతో బాధపడుతున్న ప్రజలను వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గ్రామంలో 106మంది ఒపీలు రాగ అందరికీ వైద్య పరీక్షలు చేశారు. 14 మంది రక్త నమూనాలు సేకరించినట్లు డాక్టర్ భారతి తెలిపారు.

నివాళి అర్పిస్తున్న వైసిపి అభ్యర్థి యడం బాలాజీ

మాజీ సైనికునికి నివాళి

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక అంబేద్కర్ కాలనీకి చెందిన మాజీ జవాన్, వైసిపి సీనియర్ నాయకులు గేరా రాజేంద్రప్రసాద్ జ్ఞాపకార్థ కూడిక సందర్భంగా ఆయన చిత్రపటానికి వైసిపి అభ్యర్థి యడం బాలాజీ నివాళి అర్పించారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీలో తహాశీల్దారు మునిలక్ష్మి

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

యువతీ, యువకులు ఓటు హక్కును పొందేందుకు ఎన్నికల అధికారి అవకాశం కల్పించినందున 18ఏళ్లు నిండి అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని తహాశీల్దారు ముని లక్ష్మి సూచించారు. ఓటు హక్కు వినియోగంపై మండల పరిషత్ కార్యాలయ సమీపంలో అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. మండల సమైక్య సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది నిర్వహించిన ర్యాలీని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన అవకాశమని అన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఓటు హక్కు ద్వారా రాష్ట్ర, దేశ భవిష్యత్తు నిర్దేశిత నాయకులను ఎన్నుకునే అవకాశం ప్రజలపై ఉందని అన్నారు. ఓటు హక్కు ద్వారా నీతి, నిజాయితీ కలిగిన నాయకులను ఎన్నుకునేందుకు చొరవ చూపాలని అన్నారు. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ షెడ్యూల్ విడుదల, ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్నప్పటికీ ఎన్నికల అధికారి ఓటు హక్కు పొందేందుకు ఏప్రిల్ 15వరకు అవకాశం కల్పించారని అన్నారు. అర్హత కలిగిన వాళ్లు సకాలంలో దరఖాస్తు చేసుకొని రానున్న ఎన్నికల్లో ఓటు వేసేందుకు హక్కు పొందాలని అన్నారు. కార్యక్రమంలో ఎపిఎం శ్రీమన్నారాయణ, సీసీలు హానోక్కు, రజిని, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.

జలం లేనిదే జాతికి మనుగడ లేదు

వ్యవసాయ కళాశాల్లో మాట్లాడుతున్న నిర్వాహకులు

ప్రజాశక్తి - బాపట్ల

జలం లేనిదే జాతి మనుగడ లేదని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ వి శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా స్థానిక వ్యవసాయ కళాశాల్లో అగ్రానమి సాయిల్ సైన్స్ అండ్ అగ్రికల్చరల్ కెమిస్ట్రీ శాఖలు సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన ప్రపంచ జల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న జనాభా అవసరాలను గుర్తించి నీటిని పొదుపుగా వాడుకోవలసిన అవసరం ఉందని అన్నారు. ఈ విషయాన్ని సమాజంలో ప్రచారం చేయవలసిన బాధ్యత విద్యార్థులకు ఉందన్నారు. కార్యక్రమంలో సేద్య విభాగం అధిపతి కె చంద్రశేఖర్, రావూరి వీర రాఘవయ్య, పివిఎన్ ప్రసాద్, కె హేమ, వి సీతారాంబాబు, బి అపర్ణ, టీచింగ్ స్టాఫ్ సిద్దార్థ నాయక్, బి సురేష్ కుమార్, పి గౌతమి, జి శ్రావణలక్ష్మి పాల్గొన్నారు.

వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో

బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల్లో రోటరీ క్లబ్ సహకారంతో ప్రపంచ జన్మదినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జలం ప్రాధాన్యతపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిడి స్మిత్, రోటరీ క్లబ్ సెక్రటరీ ఉపేంద్ర గుప్తా, లక్ష్మి, జి రవిబాబు, అశోక్ కుమార్, రత్న రాజు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : నీటిని పొదుపుగా వాడుకొని, వృధా కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎటీఎ శ్రీమన్నారాయణ సూచించారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మండల సమైక్య ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. నీటిని ఉపయోగించుకునేందుకు అవసరమైన కుంటలను ఏర్పాటు చేసుకుంటే భూగర్భ జలాలు స్థిరంగా ఉండి ప్రజలకు నీటి కొరత తీరుతుందని అన్నారు. నీటి పొదుపు ఆవశ్యకతను ప్రతి ఒక్కరికి తెలియజేయాలని సూచించారు.

అమర్తలూరు మండలంలో నీటి పొదుపు ర్యాలీ

పల్లెకోనలో అఖిలేష్ ప్రచారం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పల్లికోన, రాజురు గ్రామాల్లో టిడిపి అభ్యర్థి నక్క ఆనందబాబు తనయుడు నక్క అఖిలేష్ టిడిపి పథకాల ప్రచారం నిర్వహించారు. బాబు షఉరిటీ భవిష్యత్తు గ్యారెంటీ నినాదంతో కరపత్రాలు ఇంటింటికీ తిరిగి అందజేశారు. రాష్ట్ర భవిష్యత్తుకు, ప్రజల భరోసాకు చంద్రబాబును ఎన్నుకోవాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందని అఖిలేష్ సూచించారు. టిడిపి అధికారనికి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని అన్నారు. 18ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.15వందులు ఇస్తామని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామని అన్నారు. తల్లికి వందనం ద్వారా ఎంత మంది చదువుతుంటే అంతమందికి ఏడాదికి రూ.15వేల చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇలాంటి అనేక సంక్షేమ పథకాలను పేదల కోసం అమలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ వాక శేషుబాబు, బీసీ సెల్ నాయకులు రాయన్న ప్రసాదరావు, రావూరి ప్రసాద్ పాల్గొన్నారు.

పల్లెకోనలో బాబు పత్రాలు అందజేస్తున్న నక్క అఖిలేష్

బీసీలకు 45 ఏళ్లకే పెన్షన్ అమలు చేస్తాం

ప్రజాశక్తి - మార్కాపురం

టిడిపి అధికారానికి వస్తే 45ఏళ్లకే బిసిలకు పెన్షన్ అమలు చేస్తామని మాజీ ఎంఎల్ఎ కందుల నారాయణ రెడ్డి అన్నారు. ఆయన సతీమణి కందుల వసంతతో కలిసి తర్లుపాడు మండలంలోని నాగేళ్లముడిపి గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 22ఏళ్ల నుండి ప్రజల మధ్యనే ఉంటూ ప్రజలతో మమేకమై సేవ చేశానని అన్నారు. వచ్చే ఎన్నికలు పూర్తిగా ప్రజాసేవకు, డబ్బుకు మధ్య జరుగుతున్న యుద్ధమని అన్నారు. ఒక్క ఛాన్స్ ఇస్తే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి నియోజక వర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తానని పేర్కొన్నారు. మార్కాపురం ప్రత్యేక జిల్లా సాధించి ఈ ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. బీసీల రక్షణ కొరకు ప్రత్యేక చట్టం తీసుకువస్తామని తెలిపారు.

మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి రంజిత్‌బాషా ప్రకటించారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడానికి కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రజలు ఎప్పుడైనా ఈ ఫోన్ నెంబర్ల ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. జిల్లాస్థాయి గ్రీవెన్స్ కమిటీ కంట్రోల్ రూమ్ ఆడిట్ ఆఫీస్ లో ఏర్పాటు చేశామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. కంట్రోల్ రూమ్ 08643 - 297801 నిరంతరం అందుబాటులో ఉంటుందన్నారు. 1950 ఓటర్ హెల్ప్ లైన్ కలెక్టరేట్ లోని రూమ్ నెంబర్ 36లో ఏర్పాటు చేశామని, 08643 297802 ఫోన్ నెంబర్ అందుబాటులో ఉంటుందన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, సి-విజిల్ యాప్ అమలుపై కలెక్టరేట్ లోని రూమ్ నెంబర్ 36లో 08643-297804 ఫోన్ నెంబర్‌కు ఫిర్యాదులు చేయవచ్చన్నారు. కలెక్టరేట్ ఆవరణలోని డిఆర్‌సి హాల్లో మీడియా సెల్, సోషల్ మీడియా సెల్ ఏర్పాటు చేశామన్నారు. 24 గంటల పాటు పనిచేసేలా 08643-297808 ఫోన్ నెంబర్ సిద్ధంగా ఉంచామన్నారు. వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ కొరకు డి ఆర్ సి హాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 08643-297811 ఫోన్ నెంబర్ అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, స్పష్టమైన వివరాలతో కంట్రోల్ రూమ్ కి సమాచారం అందించవచ్చని ఆయన తెలిపారు.

సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఉప కలెక్టర్ రాహుల్ మీనా

నామినేషన్ ఏర్పాట్లపై పరిశీలన

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

ఏప్రిల్ 18నుంచి 25వరకు జరిగే నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లపై ఉప కలెక్టర్, ఈఆర్ఓ రాహుల్ మీనా రెవిన్యూ అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక ఉప కలెక్టర్ కార్యాలయ ఆవరణం, కోర్టు కూడలి ప్రదేశాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఏప్రిల్ 18న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలను నోటిఫికేషన్ విడుదల కానుందని అన్నారు. 18నుండి 25వరకు నామినేషన్లను స్వీకరిస్తారని తెలిపారు. అందులో భాగంగానే ముందస్తుగా ఉప కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బందోబస్తు చర్యలు, ప్రత్యేక అధికారుల నిమాయకం తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయన వెంట తహాశీల్దార్ రవికుమార్, ఉప కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన కొత్తపాలెం వైసిపి నాయకులు

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - పిట్టలవానిపాలెం

మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలు దోమ నాగేశ్వరరెడ్డి, నాని ఆధ్వర్యంలో 48మంది నాయకులు, కార్యకర్తలు స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ సమక్షంలో శుక్రవారం టిడిపిలో చేరారు. వారికి నరేంద్ర వర్మ చేతుల మీదుగా టిడిపి కండువాలు కప్పి టిడిపిలోకి సాదరంగా ఆహ్వానించారు.

టిడిపిలో చేరిన కార్యకర్తలతో రాఘవరెడ్డి, నారాయణరెడ్డి

మాగుంట సమక్షంలో 70 కుటుంబాలు

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

స్థానిక కంభం సెంటర్‌లోని టిడిపి కార్యాలయంలో మండలంలోని పెద్దనాగులవరం గ్రామానికి చెందిన 70కుటుంబాలు ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి తనయుడు టిడిపి ఎంపి అభ్యర్థి మాగుంట రాఘవరెడ్డి, మాజీ ఎంఎల్ఎ కందుల నారాయణరెడ్డి సమక్షంలో శుక్రవారం టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ మార్కాపురం ప్రత్యేక జిల్లా టిడిపితోనే సాధ్యమని అన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పూర్తయితేనే ఈ ప్రాంభూములు సస్యశ్యామలం అవుతాయని అన్నారు. వెలుగొండ పూర్తి చేసేందుకు కృషి చేయాలని కోరారు. ప్రత్యేక జిల్లా సాధిస్తేనే వెనుకబడిన ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మార్కాపురం జిల్లా సాధన కోసం కృషి చేస్తామని అన్నారు. నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే ప్రాజెక్టును వేగవంతం చేయడం ద్వారా త్వరగా పూర్తి చేస్తే రవాణా సౌకర్యం పెరుగుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఐక్యంగా సైనికుల్లా పనిచేయాలని కోరారు. పార్లమెంటు, శాసన సభ స్థానాల్లో విజయవానికి కృషి చేయాలని కోరారు.

పెండింగ్ క్లెయిమ్స్ పరిష్కారానికి చర్యలు

సిఇఒకు వివరించిన కలెక్టర్ దినేష్‌కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ వివరించారు. ఎన్నికల సంబంధిత అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సిఇఒ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్‌తో పాటు జెసి ఆర్.గోపాల్ కృష్ణ, డిఆర్ఒ ఆర్.శ్రీలత హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ జిల్లాలో ఫారం-6 దరఖాస్తులు 5,850 ఉన్నాయన్నారు. ఈ నెల 16వ తేదీ వరకు ఫారం-7 దరఖాస్తులు 884, ఫారం-8 దరఖాస్తులు 865 పెండింగ్ లో ఉన్నట్లు తెలిపారు. వీటిని సత్వరమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సెక్టార్ ఆఫీసర్లకు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అధికారాలు అప్పగించడానికి సంబంధించిన ప్రతిపాదనలను ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సిఈఓ కార్యాలయానికి కలెక్టరేట్ నుంచి అధికారులు పంపించారు. సమావేశంలో జిల్లా ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్

అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక ఏకగ్రీవం

అధ్యక్షులుగా మోహన్‌దాస్, కార్యదర్శిగా సురేంద్రబాబు ఎన్నిక

మోహన్‌దాస్

సురేంద్రబాబు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా నాగిశెట్టి మోహన్‌దాస్, ఏల్చూరి సురేంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా నాగిశెట్టి సాంబశివరావు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన పోస్టులకు ఈనెల 28న ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల అధికారులు తెలిపారు. బార్ అసోసియేషన్ ఎన్నికలలో ఉపాధ్యక్షులుగా ఎం వివిఎస్ వేణుగోపాల్, సలగల జగజ్జీవన్ రాయ్, లేడీ రిప్రజెంటివ్ గా కాకర్ల ఆదిలక్ష్మి, తెలగతోటి జ్యోతి, సంయుక్త కార్యదర్శి చందవరపు సురేష్‌బాబు, సానికొమ్ము రామిరెడ్డి, లైబ్రరీ సెక్రెటరీగా పసుపులేటి గోపాలరావు, పెద్దిరెడ్డి వెంకటేష్, కోశాధికారిగా గోపిశెట్టి లక్ష్మీనారాయణ, ముద్దా దీపలత లు పోటీలో ఉన్నట్లు ఎన్నికల అధికారులు పివి శ్రీనివాస్ గుప్తా, కెఆర్‌టి తిమోతి పాల్, బద్దిపూడి శ్రీనివాసరావు, డిఎస్‌కె చక్రవర్తి తెలిపారు. ఒంగోలు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన నాగిశెట్టి మోహన్ దాస్, ఏల్చూరి సురేంద్ర బాబును పలువురు న్యాయవాదులు అభినందించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ నల్లూరి సత్య శ్రీనివాస్, గుడ్ల చంద్రశేఖర్, బోడపాటి శివరామకృష్ణ, గనిపినేని శ్రీనివాసులు, ఏడుకొండలు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి నివాళి

అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కొండయ్య

ప్రజాశక్తి-చీరాల

చీరాల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంఎం.కొండయ్య పేరును చంద్రబాబు ప్రకటించిన నేపథ్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి కొండయ్య శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు టిడిపి టికెట్ ప్రకటించడం పట్ల టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబుకు, యువనేత నారా లోకేష్ కు మరియు జనసేన వ్యవస్థాపకులు పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలు అందరూ మార్పు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. అనంతరం ప్రచార కార్యక్రమంలో భాగంగా వేటపాలెం మండలం దేశాయిపేటకు చేరుకున్నారు. ఆయన వెంట కొండయ్య తనయుడు గౌరీ అమృనాథ్, రాజశేఖర్, టిడిపి నాయకులు ఉన్నారు.

మళ్లీ తెలుగుదేశంలోకి..

ఎమ్మెల్యే స్వామి వద్దకు వచ్చిన దావీదు

ప్రజాశక్తి-శింగరాయకొండ

మండలంలోని శానంపూడి గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులైన రావినూతల దావీదుకు ఇటీవల వైసిపి నాయకులు మంత్రి ఆదిమూలపు సురేష్ సమక్షంలో వైసిపి కండువా కప్పి.. ఆ పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి కార్యాలయం నుంచి బయటకు వచ్చిన తర్వాత రావినూతల దావీదు శానంపూడి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులకు విషయం చెప్పారు. శుక్రవారం రాత్రి కొండెపి నియోజకవర్గ శాసనసభ్యులు డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామిని కలిసి.. వైసిపి నాయకులు తనను ప్రలోభాలకు గురిచేసిన విషయాలను వివరించారు. మళ్లీ టిడిపి గూటికి వచ్చారు. కార్యక్రమంలో పులివర్తి లక్ష్మీ నారాయణ పులివర్తి బసవయ్య పాల్గొన్నారు.

పొదిలిలో దాహం కేకలు..

- రోజుల తరబడి సాగర్‌నీటి కోసం ఎదురుచూపులు
- గుక్కెడు మంచినీటి కోసం నిరసన తెలుపుతున్న ప్రజలు

తాగునీటి కోసం పొదిలిలో నీటి సంప్ వద్ద రహదారిపై రాస్తారోకో చేస్తున్న ప్రజలు

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి మండలంలో ప్రజలు దాహంతో అల్లాడుతున్నారు. గుక్కెడు మంచినీటి కోసం రోజుల తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి దాపురించింది. గత ఏడాది సరైన వర్షపాతం లేకపోవడంతో భూగర్భజలాలు కూడా అడుగంటాయి. వాడుక నీటికీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిన్నమొన్నటివరకు అంతోఇంతో భూగర్భ జలాలు ప్రజలకు ఉపయోగపడగా గత నెల రోజుల వ్యవధిలో అవి బాగా పడిపోతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు పట్టణానికి, మండలంలోని ఇతర గ్రామాలకు తాగునీటి సరఫరా చేసే ఎన్ఎస్‌పి (సాగర్ మంచినీరు) పథకం నిర్వహణాలోపంతో మంచినీటికి కటకట ఏర్పడింది.

దర్శిలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుండి గతంలో రెగ్యులర్‌గా వచ్చే నీరు, సాగర్ రిజర్వాయర్ నిండుకోవడంతో కోత ఏర్పడింది. అయినా ఏప్రిల్, మే వరకు పొదుపుగా వాడుకునేందుకు తాగునీటికి ఇబ్బంది లేదని అధికారులు చెబుతున్నా అక్కడి నుండి నీరు సరఫరా సరిగా జరగడం లేదు. దీని వల్ల గ్రామాలలోని ప్రజలు సాగర్ నీటిని మరచిపోయి బబుల్ వాటర్‌నే తాగుతున్నారు. ఇక పట్టణంలోని పలు కాలనీలకు సాగర్ నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. దీనికితోడు రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతుండటంతో నీటి ఎద్దడి పెరుగుతోంది. గతంలో రెండు, మూడు రోజులకు ఒకసారి ఇచ్చే సాగర్ నీరు నేడు 15 రోజులకు ఒకసారి కూడా అందరికీ అందడం లేదు. కొష్టాలపల్లి, అన్నవరం, అమూదాలపల్లి, నిమ్మవరం, కాటూరివారి పాలెం, రాజుపాలెం, మాదాలవారిపాలెం వంటి శివారు గ్రామాలకు సాగర్ మంచినీటి పైపులైన్లు ఉన్నా నీరు సరిగా రాక వారికి నిత్యం ఎదురు చూపులు తప్పడం లేదు. దర్శి నుండి పొదిలికి వచ్చే పైపులైన్‌లో రాజంపల్లి వద్ద నీటిని మళ్లిస్తున్నారని ఇక్కడి సిబ్బంది భావిస్తున్నారు. దీనికి తోడు ఇక్కడ నీటి సరఫరా చేసే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రజల సమస్యను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలో నీటిఎద్దడి నివారణకు తాత్కాలికంగా శివాలయం వద్ద ఉన్న సంప్ వద్ద సింటెక్స్ ట్యాంకు ఏర్పాటు చేసి అందిస్తున్నారు. దర్శి నుండి నీటి సరఫరా సరిగా లేకపోతే ఇక్కడ కూడా నీటి కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. గత ఎన్నికలకు ఏడాది ముందు పొదిలికి వచ్చిన నాటి ప్రతిపక్ష నేత, నేటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాను అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పొదిలి పెద్ద చెరువును ఎస్ఎస్ ట్యాంకుగా మార్చి దాహం తీరుస్తానని ఇచ్చిన హామీ నేటికి ఆరు సంవత్సరాలు అవుతున్నా అమలుకు నోచుకోలేదు. ఎస్ఎస్ ట్యాంకు కాదు కదా దర్శి కాలువ నుండి సాగర్ నీటిని పెద్ద చెరువుకు మళ్లించేందుకు అనుమతి ఇచ్చిన రూ.50 కోట్ల ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

30న ఎస్సీ, ఎస్టీ రిలీఫ్ బాధితుల సమావేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎస్‌సి, ఎస్‌టి కేసుల్లో కోర్టులపై కోర్టులు వేస్తూ, రిలీఫ్ మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్న కలెక్టర్, డిఆర్ఓ అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా ఈ నెల 30న ఒంగోలులో రిలీఫ్ రాని బాధితుల సమావేశం నిర్వహిస్తున్నట్లు దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు తెలిపారు. శుక్రవారం ఒంగోలు తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాగేంద్ర మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి కేసుల్లో రిలీఫ్ రాని బాధితులు ఈ నెల 30 ఉదయం 11 గంటలకు ఒంగోలు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న సమితి కార్యాలయంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

యువత భవితను చిదిమేస్తున్న డ్రగ్ మాఫియా

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధనరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో యువత భవితను జగన్ డ్రగ్ మాఫియా చిదిమేస్తోందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు ఓ ప్రకటనలో విమర్శించారు. టిడిపి హయాంలో పెట్టుబడుల ఆకర్షణలో అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రాన్ని జగన్ రెడ్డి గంజాయి, డ్రగ్ రవాణాలో నెంబర్ 1 స్థానానికి చేర్చాడన్నారు. విశాఖను స్టేట్ క్యాపిటల్‌గా మారుస్తానని చెప్పి డ్రగ్ క్యాపిటల్ మార్చారని విమర్శించారు. వీరభద్రరావు సోదరుడు కూనం పూర్ణచంద్రరావు ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం వైసిపి సీనియర్ నేత అని, ఇతనికి విజయసాయిరెడ్డితో సన్నిహిత సంబంధాలున్నాయన్నారు. ఈ కంటెయినర్‌లో మార్ఫిన్, కొకైన్, హెరాయిన్, యాంఫెటమిన్, మెస్కెలిన్ వంటి భయంకర మత్తు పదార్థాలున్నాయని సిబిఐ తన నివేదికలో పేర్కొందన్నారు. గతంలో విజయవాడలోని ఆశి ట్రేడర్స్ పేరుతో ముంద్రా పోర్టులో రూ.21 వేల కోట్ల విలువైన హెరాయిన్ దిగుమతిలో కాకినాడ ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి కీలకంగా వ్యవహరించారన్నారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు ఏపిలోనే దొరకుతున్నాయన్నారు. బ్రెజిల్ నుంచి మత్తు పదార్థాలు దిగుమతి చేస్తున్నారని తెలిసి జగన్ రెడ్డి తన అధికారులను పంపారా.? అని ప్రశ్నించారు. కల్తీ మద్యం మాఫియాతో ఇన్నాళ్లు ప్రజల ఇళ్లు, ఒళ్లు, ప్రాణాలు నాశనం చేశారని, ఇప్పుడు గంజాయి, డ్రగ్స్, కల్తీ మద్యంతో రాష్ట్రాన్ని డ్రగ్స్ క్యాపిటల్‌గా మారుస్తున్నారని విమర్శించారు. జగన్ రెడ్డి దోపిడీని యువత ప్రశ్నించకుండా, నిలదీయకుండా ఉండటం కోసం మత్తులో దించి, గేమింగ్, క్యాసినోతో జాతిని నిర్వీర్యం చేస్తున్నాడని, తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుస్తున్నాడని ఆరోపించారు. సోషల్ మీడియాలో ఉద్దేశ్యపూర్వకంగా తెలుగుదేశం పార్టీకి ఆపాదించే కుట్ర చేస్తున్నారన్నారు. కూనం వీరభద్రరావు కరోనా సమయంలో సిఎం రిలీఫ్ ఫండ్‌కి రూ.50 లక్షలు విరాళం ఇచ్చారని, ఆ సమయంలో విజయసాయిరెడ్డితో కలిసి దిగిన ఫోటోలు కూడా ఉన్నాయన్నారు. డ్రగ్స్ సీజ్ చేయడానికి వెళ్లిన సమయంలో స్థానిక పోలీసులు తీవ్రంగా ప్రతిఘటించారని సిబిఐ అధికారులు తమ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారని తెలిపారు. తాడేపల్లి ఆఫీస్ ప్రమేయం లేకుండా సిబిఐ అధికారుల్ని స్థానిక పోలీసులు అడ్డుకోగలరా అని ప్రశ్నించారు. 16వ తేదీన కంటైనర్ వస్తే, 20వ తేదీ వరకు సిబిఐ అధికారుల్ని నిలువరించారన్నారు. డ్రగ్స్ కుంభకోణం వెనుక తాడేపల్లి ప్యాలెస్ హస్తం ఉందన్నారు. దీంతో వైసిపి నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారన్నారు. జగన్ రెడ్డికి సంబంధం లేకుండా ఎవరైనా ఇంత స్థాయిలో డ్రగ్స్ వ్యాపారం చేసే అవకాశం ఉందా.? అని ప్రశ్నించారు. గతంలో నిమ్మగడ్డ ప్రసాద్, కోనేరు ప్రసాద్ వంటి వారితో వైసిపి చేయించిన అక్రమాలు అందరికీ తెలుసన్నారు. 2019 ఎన్నికల సమయంలో వివేకా హత్య, కోడికత్తి డ్రామాను టిడిపి పైకి నెట్టారన్నారు. విశాఖకు మకాం మారుస్తున్నానని జగన్ రెడ్డి చెప్పడం డ్రగ్స్, భూకబ్జాల కోసమేనా.? అని ప్రశ్నించారు. విశాఖ కేంద్రంగా డ్రగ్స్ మాఫియాను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. యువతను డ్రగ్స్ మత్తులో ముంచి రాష్ట్రాన్ని లూటీ చేసేందుకు జగన్ రెడ్డి ప్రయత్నిస్తున్నాడని విమర్శించారు. కాకినాడ, గంగవరం, కృష్ణపట్నం పోర్టుల్ని తనవారికి కట్టబెట్టి తద్వారా తమ అక్రమ వ్యాపారాల్ని చేసుకోవడానికి తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. గతంలో ఆఫ్రికా దేశాల్లో ద్వారంపూడి పర్యటించగా ఆ దేశాలకు జగన్ రెడ్డి బియ్యం మాఫియా రాష్ట్రంలోని రూ.7 వేల కోట్ల విలువైన బియ్యం ఎగుమతి చేసి దోచుకున్నారన్నారు. ప్రాంతీయ పార్టీకి చెందిన ఎంపి విజయసాయిరెడ్డి బ్రెజిల్ దేశాధ్యక్షుడికి శుభాకాంక్షలు చెప్పాల్సిన అవసరం ఏంటో చెప్పాలన్నారు. నేడు బ్రెజిల్ నుంచి వచ్చిన డ్రగ్ కంటెయినర్‌తో ఇది బట్టబయలైందని దామచర్ల తెలియజేశారు.

గుండ్లకమ్మను కాపాడాలని వినతి

ప్రజాశక్తి - అద్దంకి

అద్దంకి పరిసర గ్రామాలకు జీవనదిగా ఉన్న గుండ్లకమ్మ నదిని అన్ని విధాల కాపాడాలని దశాబ్దాలుగా ప్రజలు, ప్రజా సంఘాల నుండి ఎన్నో వినతి పత్రాలు సంబంధిత అధికారులకు అందించారు. జల దినోత్సవం సందర్భంగా కాలుష్య నియంత్రణ, రివర్ కన్జర్వేషన్ కమిటీ కన్వీనర్ మన్నం త్రిమూర్తులు మాట్లాడుతూ జీవనది గుండ్లకమ్మ విషయంలో అధికారులు గుండ్లకమ్మ నదిని వేస్ట్ మెటీరియల్ డంపు నుండి కాపాడాలని కోరారు. చిల్ల చెట్లు పెరిగి అడవిని తలపించేలా ఉన్న ప్రదేశాలను క్లియర్ చేయాలని అన్నారు. ఇసుక అక్రమ తవ్వకందారులు ఎక్కడపడితే అక్కడ ఇసుక వనరులను కొల్లగొట్టే విషయాన్ని ఆపడం లేదని పేర్కొన్నారు. రూ.వేల కోట్ల ప్రజాధనంతో 1985లో నిర్మించిన బ్రిడ్జిని కాపాడుటలో సంబంధిత అధికారుల ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపించారు. అధికారుల వైఖరిని ప్రజా సంఘాలు వ్యతిరేకిస్తూ గుల్లకమన్నదిని

గుండ్లకమ్మను కాపాడాలని విన్నపం..

కాపాడమని పోరాటం చేస్తున్నామని తెలిపారు. సంబంధిత అధికారులు సత్వర చర్యలు చేపట్టకపోతే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు వెళతామని హెచ్చరించారు. విద్వాన్ జ్యోతి చంద్రమౌళి మాట్లాడుతూ గుండ్లక మనదని అన్నారు. అటుకు ప్రాంతం నుండి తూర్పున బంగాళాలను కలిసే వరకు 320కిలోమీటర్లు ప్రయాణించి ఎన్నో గ్రామాలకు, పట్టణాలకు సాగు, త్రాగునీటిని అందిస్తుందని అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా కోర్టు ప్రాంగణంలో మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి షేక్ మహమ్మద్ రఫీకి వినతి పత్రం అందజేశారు. గుండ్లకమ్మ నది నిర్వీర్యంపై దినపత్రికల్లో ప్రచురించిన 40పేజీల పేపర్ క్లిప్పింగ్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎజీపీ యర్రమోతు రమేష్ బాబు, అన్నమనేని వెంకట్రావు, చెన్నుపాటి రామాంజనేయులు, చిన్ని మురళీకృష్ణ, మంగమూరి చిరంజీవి, వారణాసి రఘురామశర్మ, పుట్టంరాజు తులసీదాస్ పాల్గొన్నారు.

పూల రైతుల అభివృద్ధికి కృషి చేస్తా

బాపట్ల టిడిపి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ

ప్రజాశక్తి - బాపట్ల

పూల సాగు చేసుకుని జీవనం సాగించే సన్నా, చిన్న కారు రైతుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని బాపట్ల అసెంబ్లీ టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. మండలంలోని వెదుళ్ళపల్లి, కొత్త పాలెం గ్రామాల నుండి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన 50మంది స్థానిక టిడిపి కార్యాలయంలో నరేంద్రవర్మ సమక్షంలో టిడిపిలో చేరారు. కార్యక్రమంలో టిడిపి మాజీ మండల అధ్యక్షులు కావూరి శ్రీనివాసరెడ్డి, వెదుళ్ళపల్లి గ్రామ నాయకులు

వెదుళ్ళపల్లి, కొత్తపాలెం గ్రామాల వారితో నరేంద్ర వర్మ

కుంచాల సుబ్రహ్మణ్యంరెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి గుడిపల్లి సాంబశివరావు, టిడిపి మండల అధ్యక్షులు సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు ఉచిత వైద్యం

ప్రజాశక్తి- రేపల్లె

సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత వైద్య నిర్ధారణ శిబిరానని నిర్వహిస్తున్నట్లు జిల్లా భవిత విద్యా కోఆర్డినేటర్ ఎం జోత్స్న తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోని భవిత స్కూల్ నందు ప్రత్యేక అవసరాలు గల మానసిక వైకల్యం కలిగిన పిల్లలకు ఉచిత వైద్య నిర్ధారణ శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు పుట్టుకతో వచ్చిన వైకల్యం పట్ల తల్లి, దండ్రులు ఎలాంటి ఆందోళన చెందవద్దని అన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. వైద్య సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. వారం వారం భవిత సెంటర్‌కు తీసుకొచ్చి

సభలో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ ఎం జోత్స్న

వైద్యసేవలు పొందాలని సూచించారు. పిజియో థెరఫీ చేస్తున్నట్లు చెప్పారు. భవిత సెంటర్‌కు వచ్చేవారికి ఛార్జీల ఖర్చులు కూడా ప్రభుత్వమే ఇస్తుందని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని ప్రేమగా ఆదరిస్తే రికవరీ అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించడానికి ఆడియోలాజిస్ట్, సిజియోథెరపిస్ట్, ఆప్తమాలజిస్ట్, సైకాలజి డాక్టర్స్ బృందం హాజరై పరీక్షలు చేసి అవసరమైన ఉపకరణాలు పొందుటకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం దూరం నుంచి వచ్చిన పిల్లలకు భోజన వసతి, రవాణా ఛార్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు అనురాధ, శ్రీనివాస్, మోహన్, మహాలక్ష్మి పాల్గొన్నారు.

హనుమంతరావు ఘాట్ వద్ద ఎంఎల్ఎ రవికుమార్

హనుమంతరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - యద్దనపూడి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు 27వ వర్ధంతి సందర్భంగా యద్దనపూడి గ్రామంలోని హనుమంతరావు ఘాట్ వద్ద అద్దంకి ఎంఎల్ఎ గొట్టిపాటి రవి కుమార్ శుక్రవారం పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ తన పెద నాన్న పేదల సంక్షేమం కోసం పని చేశారని అన్నారు. తాము కూడ ఆయన ఆశయాలు సాధించుటకు ప్రయత్నం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో గొట్టిపాటి భరత్, గొట్టిపాటి కమల కిషోర్ (బాబి), గ్రామ నాయకులు వెంకటరావు, శ్రీరామ మూర్తి, హనుమంతరావు, పెరవలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న అన్నా వెంకట రాంబాబు

వైసీపీ అభ్యర్థి రాంబాబు ప్రచారం

ప్రజాశక్తి - మార్కాపురం

నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని వైసిపి మార్కాపురం అభ్యర్థి, గిద్దలూరు ఎంఎల్ఎ అన్న వెంకట రాంబాబు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని 27వ వార్డులో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. వార్డులోని ప్రతి గడపకు వెళ్లారు. ఓటర్లను కలుసుకున్నారు. తాను ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చినట్లు చెప్పారు. గిద్దలూరు నుండి రెండు పర్యాయాలు ఎంఎల్ఎగా పనిచేసినట్లు చెప్పారు. అవినీతికి తావు లేకుండా ప్రజలతో మమేకమైనట్లు చెప్పారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో వైసిపి పార్లమెంటు అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఎంఎల్ఎగా తనను గెలిపించాలని కోరారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి అర్హత కలిగిన వారందరికీ సంక్షేమ ఫలాలు అందించారని అన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి చేశారని చెప్పారు. ప్రజలు మంచిని గుర్తించి వైసిపిని ఆదరించాలని కోరారు.

మైనారిటీలతో టిడిపి అభ్యర్థి నారాయణరెడ్డి

ప్రచారంలో టిడిపి అభ్యర్థి కందుల

ప్రజాశక్తి - మార్కాపురం

పట్టణంలోని 21వ వార్డులో గల ఇస్లాంపేట మసీదు వద్ద టిడిపి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో తన గెలిపించాలని ముస్లిం ఓటర్లను కోరారు. ఆయన వెంట స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

శ్మశానంలో సౌకర్యాల కల్పన

ప్రజాశక్తి పర్చూరు

స్థానిక హిందూ స్మశాన వాటిక అభివృద్ధికి గ్రామస్తులు నడుం బిగించారు. మౌలిక వసతుల అభివృద్ధికి కలసికట్టుగా పనులు చేపట్టారు. నిర్మాణం పనులు చేపట్టేందుకు భూమి పూజ చేశారు. స్మశాన వాటికలో ముళ్ళ పొదలను తొలగించి అంత్యక్రియలు చేసేందుకు అవసరమైన పనులు చేపట్టినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఇక మీదట అంత్యక్రియలకు ఇబ్బందులు లేకుండా చేస్తామని తెలిపారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు

సీఎం కేజ్రీవాల్ అరెస్టుకు నిరసన

ప్రజాశక్తి - మార్కాపురం

ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని కోర్టు సెంటర్లో గల అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసి నిరసన వ్యక్తం చేశారు. బిజెపి కుటిల రాజకీ యాలకు ఈ అరెస్టు ఒక నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. అక్రమ అరెస్టులను ఖండించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీల సమావేశంలో సూపర్‌వైజర్ శివజ్యోతి

పౌష్టికాహార పక్షోత్సవం

ప్రజాశక్తి - రేపల్లె

స్థానిక ఈస్ట్ మహమ్మదీయపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శివ జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాల్లో అందిస్తున్న సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కె పద్మావతి, డి శివ పార్వతి పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - మేదరమెట్ల

మార్చ్ 16నుండి ఎన్నికల నిబంధనలు అమలులోకి వచ్చినట్లు సిఐ శివరామకృష్ణరెడ్డి తెలిపారు. శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని అన్నారు. అనుమతి లేకుండా రాజకీయ నాయకుల బొమ్మలు, గోడలపై రాతలు, ర్యాలీలు, ధర్నాలు చేయవద్దని తెలిపారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా నడుచుకున్నా, శాంతి పరిరక్షణకు భంగం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసు 30వ యాక్ట్ అమలులో ఉన్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. వివాదాలు సృష్టించే వారిపట్ల సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామాలు అన్నీ పోలీసు పర్యవేక్షణలో ఉన్నట్లు తెలిపారు.

పంగులూరు : మే 13న జరగనున్న పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మార్చ్ నెల 16నుండి ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని రేణంగివరం ఎస్ఐ కెకె తిరుపతిరావు సూచించారు. కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి వ్రాతపూర్వక అనుమతులు లేకుండా రాజకీయ పార్టీల గుర్తులు, వ్రాతలు, నాయకుల ఫోటోలు కలిగిన ఫ్లెక్సీలు పెట్టడం, జండాలు కట్టడం, గోడలమీద బొమ్మలు వేయడం, వ్రాతలు వ్రాయడం, ప్రచారం కొరకు వాహనాలు వాడడం చేయకూడదని సూచించారు. 30పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున చీరాల డిఎస్పి వ్రాతపూర్వక అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు, ధర్నాలు, ప్రచార కార్యక్రమాలు చేయవద్దని సూచించారు. మైక్ పర్మిషన్ లేకుండా మైకులు వాడవద్దని అన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టడం, బెదిరించడం చేయరాదని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతియుతంగా ఉండాలని సూచించారు.

కార్యకర్తలతో మాట్లాడుతున్న గొట్టిపాటి రవికుమార్

టిడిపి పథకాలు వివరించాలి

ప్రజాశక్తి - పంగులూరు

జగన్ సినిమా అయిపోయిందని, వైసిపీ జీవితంలో ఎప్పుడూ గెలిచే పరిస్థితి లేదని ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ముప్పవరంలోని టిడిపి కార్యాలయంలో కొరిశపాడు మండలం పి.గుడిపాడు, మేదరమెట్ల, తిమ్మనపాలెం, అనమనమూరు, తమ్మవరం, ఎర్రబాలెం, బొడ్డువాని పాలెం గ్రామాల టిడిపి శ్రేణులతో ఆయన విడివిడిగా సమావేశం అయ్యారు. తాజా రాజకీయ పరిస్థితులు, ఓటరు జాబితా పట్ల అప్రమత్తత, సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని తెలిపారు. నిత్యావసర ధరలు మండిపోతుంటే ప్రజలు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో బూత్, యూనిట్ ఇంచార్జిలు, కుటుంబ సారథులు, పేజీ నేస్తం సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

నామినేషన్లు స్వీకరిస్తున్న ఎన్నికల అధికారి ప్రశాంత్

బార్ అసోసియేషన్ నామినేషన్ల స్వీకరణ

ప్రజాశక్తి - రేపల్లె

న్యాయవాదుల సంక్షేమ సంఘం కార్యవర్గ ఎన్నికలకు నామినేషన్లు స్వీకరించినట్లు ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్ తెలిపారు. కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఆయన విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. బార్ అసోసియేషన్ ఎన్నికలకు 18 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారని తెలిపారు. అధ్యక్ష పదవికి మేకా పూర్ణచంద్రరావు, కేసన వెంకట గోపాలరావు, కొండపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి పదవికి టివిఎస్ దీనారాజ్, జివి గిరిధర్, కొండపల్లి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి పదవికి ఓ రాంబాబు, కెజిఎల్ శ్రీనివాసరావు, గ్రంథాలయ కార్యదర్శి పదవికి ఎన్వి ఎస్ వర్మ, కె సంజయ్ న్యాయవాదులు నామినేషన్ పత్రాలు దాఖలు చేసారని తెలిపారు. ఉపాధ్యక్షులుగా పి భూషణం, కోశాధికారిగా వై రాజేష్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శి పి నాగాంజనేయులు, కార్యవర్గ సభ్యులుగా వై ధర్మతేజ, ఎం సూరిబాబు, జి రామారావు, నల్లూరి వెంకటేశ్వరరావు, జి కుమార్ నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఒక్కొక్కరే నామినేషన్లు దాఖలు చేసిన పదవులకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. నామినేషన్ పత్రాల పరిశీలన, ఉపసంహరణ అనంతరం అభ్యర్థుల తుది జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికలు ప్రశాంతంగా క్రమశిక్షణగా నిర్వహించుకోవాలని కోరారు.

ధర్మతేజ నామినేషన్

ప్రజాశక్తి - రేపల్లె

నామినేషన్ దాఖలు చేస్తున్న ధర్మతేజ

బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్గా యువ న్యాయవాది వై ధర్మతేజ శుక్రవారం తన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్కు అందజేశారు. ఈ సందర్భంగా ధర్మ తేజ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి ఎందరో తెలిసీ, తెలియక చేసిన చిన్న చిన్న పొరపాట్లు వల్ల కోర్టు దాకా రావాల్సి వస్తుందని, అలాంటి వారికి సహాయం చేయడానికి ముందుంటానని తెలిపారు.

కార్మిక వ్యతిరేక ఎన్డీఏ కూటమిని ఓడించండి

- ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం
- కార్మిక లోకానికి ఏఐటీయూసీ పిలుపు

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్ర

కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలతో ముందుకు వెళ్తున్న ఎన్డిఎ కూటమిని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ కార్మిక లోకాన్ని కోరారు. ఏఐటీయూసీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం సిపిఐ సెక్రెటరీ అందె నాసరయ్య అధ్యక్షతన స్థానిక పూల సుబ్బయ్య శాంతి భవన్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రావులపల్లి మాట్లాడుతూ దేశ ప్రజలకు విశిష్ట సేవలను అందిస్తున్న రైల్వేలు, పౌర విమానయాన, నౌకాశ్రయాలు, ఎల్ఐసి, హిందుస్థాన్ పెట్రో కెమికల్స్, పోస్టల్ డిపార్ట్మెంట్, బిఎస్ఎన్ఎల్ తదితర రూ.లక్షల కోట్ల విలువ చేసే జాతి సంపదను మోడీ ప్రభుత్వం నష్టాలు చూపుతూ కారు చౌకగా అంబానీ, ఆదానీ తదితర పారిశ్రామిక దిగ్గజాలకు దోచిపెడుతుందని ఆరోపించారు. జాతి సంపదను విచ్ఛిన్నం చేసే హక్కు మోడీ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కొక్కటిగా మూసివేస్తున్నారని అన్నారు. ఫలితంగా ఆయా పరిశ్రమల్లో పనిచేసే కోట్లాది మంది కార్మికులు ఉపాధి అవకాశాలు కోల్పోయి బజారున పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తామని పదేపదే చెప్పిన ఎన్డిఎ అధికారానికి వచ్చిన అనంతరం ఏ ఒక్కరికీ ఉద్యోగ అవకాశాలు ఇవ్వకపోగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను ఊడగొట్టే పరిస్థితి తీసుకువచ్చారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల పోరాట ఫలితంగా నిర్మించుకున్న విశాఖ స్టీల్ ప్లాంటును కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతుందని అన్నారు. గత ఏడు దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేని విధంగా కార్మిక హక్కులకు భంగం కలిగించే విధంగా మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాల్లో భారీ మార్పులు తీసుకొచ్చిందని అన్నారు. దీంతో కార్మికులకు ఉపాధి, ఉద్యోగ భద్రత కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలో స్టీల్ ప్లాంట్, రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టులతో పాటు దేశ సంపదలైన బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, రైల్వేలు, పౌర విమానయాన సంస్థలను కాపాడుకోవడానికి పార్టీలకు, వర్గాలకు అతీతంగా పెద్ద ఎత్తున పోరాడాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు షేక్ ఖాసిం, ఏఐటియుసి ఏరియా అధ్యక్షులు ఏలూరి వెంకటరెడ్డి, సిపిఐ పట్టణ కార్యదర్శి చిత్తూరి పెద్దన్న, ఏఐటీయూసీ నాయకులు డి సుబ్బారావు పాల్గొన్నారు.

మీడియా కమిటీ సూచనలు పాటించాలి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి - బాపట్ల

మాట్లాడుతున్న ఆర్ఒ చామకూరి శ్రీధర్

ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు మీడియా మానిటరింగ్ కమిటీ సూచనలు, ఆదేశాలు కచ్చితంగా పాటించాలని బాపట్ల అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చామకూరి శ్రీధర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీలు ప్రచారానికి సంబంధించి అనుమతులను సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకొని పొందొచ్చన్నారు. దానికి సంబంధించిన ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రచార వాహనాల అనుమతులు, ఇంటింటి ప్రచారంకు సంబంధించి సువిధ యాప్ ద్వారా మాత్రమే అనుమతులు తీసుకోవాల్సి ఉందన్నారు. పత్రికలకు సంబంధించి పెయిడ్ ఆర్టికల్స్ మీడియా మానిటరింగ్ కమిటీ నిఘా ఉంటుందని అన్నారు. ప్రింట్ ఆర్టికల్స్ ప్రచురిస్తే దానికి సంబంధించిన ఖర్చులు ఆయా అభ్యర్థి ఖాతాకు చేరుతాయని అన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి ఎంఎల్ఎ అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఖర్చు చేసుకోవచ్చని అన్నారు. పార్లమెంటు అభ్యర్థి రూ.90లక్షల వరకు ఖర్చు చేసుకోవచ్చని అన్నారు. దీనిపై ఈపాటికే రాజకీయ పార్టీలకు వివరించినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకే పత్రికలు వివిధ యాప్లో ప్రచారాలు ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి ప్రచురించాలని అన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి అంశంపై ఎన్నికల విభాగం నిఘా తోపాటు మీడియా మానిటరింగ్ కమిటీ పరిశీలిస్తుందని అన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం మొదలు అభ్యర్థుల ఎన్నిక ఫలితం ప్రకటించే వరకు అవసరమైన అన్ని చర్యలకు తీసుకున్నామని అన్నారు. బాపట్ల అసెంబ్లీలో 202 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఈవీఎంలను బాపట్ల పబ్లిక్ స్కూల్లో భద్రపరిచామని అన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఎన్నికల విధి విధానాలకు లోబడి మాత్రమే పోటీలో ఉన్న అభ్యర్థులు, మీడియా ప్రతినిధులు నడుచుకోవాలని అన్నారు. సమావేశంలో బాపట్ల తహసీల్దార్ ఎం శ్రావణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, పిట్టలవానిపాలెం తహసీల్దార్ స్ఫూర్తి పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలి

మార్కాపురం సిఐ ఆవుల వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

మాట్లాడుతున్న మార్కాపురం సిఐ ఆవుల వెంకటేశ్వర్లు

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపేందుకు ప్రజలు, నాయకులు సహకరించాలని సిఐ ఆవుల వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని తిప్పాయపాలెం గ్రామంలో గ్రామీణ ఎస్ఐ ఎం వెంకటేశ్వరనాయక్ ఆధ్వర్యంలో గ్రామ సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల్లో ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం ఎన్నికల నిబంధనతో పాటు 144సెక్షన్ అమల్లో ఉందని తెలిపారు. ప్రజలు గుంపులు నిలబడరాదని హెచ్చరించారు. ఎన్నికల అనంతరం విజయం సాధించిన వారు బాణసంచా కాల్చడం, ఊరేగింపులు చేయడం మానుకోవాలని అన్నారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేసేలా గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలందరూ పోలీసు వారికి సహకరించాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపేందుకు తమ వంతు కృషి చేయాలని అన్నారు. గ్రామాల్లో వివాదాస్పదంగా ఉండే వ్యక్తుల సమాచారం పోలీసులకు ఇవ్వాలని సూచించారు.

డస్ట్బిన్లు అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

రోటరీ ఆధ్వర్యంలో డస్ట్బిన్లు పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

పంచాయితీ పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు రోటరీ ఆధ్వర్యంలో సపోర్ట్ సంస్థ ఆర్థిక సహకారంతో రూ.70వేల విలువైన 80డస్ట్ బిన్స్ పంచాయితీ కార్మికులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు మాట్లాడారు. గ్రామం పరిశుభ్రత గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. రొటేరియన్ కోట శ్రీనివాసరావు నిర్దేశించిన ప్రణాళికలో భాగంగా ప్రతి ఇంటి నుండి సేకరించిన చెత్తను తేలి కగ్గా తరలించేందుకు అనువుగా డిజైన్ చేసిన డస్ట్ బిన్లు అందజేసినట్లు తెలిపారు. పంచాయితీ సిబ్బంది రాఘవరెడ్డి రోటరీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సీనియర్ సభ్యులు పాబోలు ఉదయభాస్కర్, కోడూరి సుబ్రహ్మణ్యచారి, అగ్నిగుండాల కృష్ణ, సపోర్ట్ అధ్యక్షులు పోలిశెట్టి చంద్రం, పాబోలు వెంకన్న, కాసా అశోక్ కుమార్, కోమటి ఆంజనేయులు, కారుమూడి సుబ్బారెడ్డి, రోటరీ ట్రస్ట్ అధ్యక్షులు గడ్డిపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి అభ్యర్థి హనిమిరెడ్డి

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని అన్ని గ్రామాల్లో వైసిపి బలోపేతానికి కృషి చేయాలని వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి పానెం చిన్న హనిమిరెడ్డి కార్యకర్తలను కోరారు. మండలంలోని పుట్టావారిపాలెంలోని వైసిపి కార్యాలయంలో వెల్లలచెరువు, కొమ్మాలపాడు, సజ్జాపురం, కొప్పరం, మక్కెనవారిపాలెం గ్రామాలకు చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుల్లా కష్టపడి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పిటిసి అడవి శ్రీనివాసరావు, కారసాని కోటిరెడ్డి, కైపు మహేష్ రెడ్డి, ఒరుగంటి కోటిరెడ్డి, నాగబోతు రామాంజనేయులు పాల్గొన్నారు.

గొల్లపాలెంలో నేత్రదానం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

కోటపాటి శ్రీనివాసరావు

మండలంలోని గొల్లపాలెంలో నేత్రదానం చేశారు. గ్రామానికి చెందిన కోటపాటి శ్రీనివాసరావు (57) మృతి చెందగా కుటుంబ సభ్యులు నేత్రదానం చేసేందుకు ముందుకు వచ్చి రోటరీ అవయవదాన కమిటీకి సమాచారం ఇచ్చారు. కమిటీ ప్రతినిధులు జెట్టి వెంకటేశ్వర్లు, సోమేపల్లి రామ్మోహన్రావు గుంటూరు శంకర కంటి వైద్య శాలకు సమాచారం అందించారు. వైద్యులు గొల్లపాలెం వచ్చి శ్రీనివాసరావు కార్నియాలను సేకరించారు. 543వ నేత్రదానం చేసినందుకు దాత భార్య సుధారాణి, కుమారుడు ఈశ్వర్, కుమార్తె ప్రణీతను అభినందించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు కరి కమలేశ్వరరావు, కోశాధికారి చుండి సాంబశివరావు, సభ్యులు దాత కుటుంబ సభ్యులను అభినందించారు.

'పాంచ్ న్యాయ' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నేతలు

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి బిఆర్ గౌస్
- 'పాంచ్ న్యాయ' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కాంగ్రెస్ ప్రతిపాదించిన ఐదు న్యాయ సూత్రాల అమలుతోనే దేశంలోని యువత, మహిళ, రైతు, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి బిఆర్ గౌస్ తెలిపారు. స్థానిక డిసిసి కార్యాలయంలో శుక్రవారం రాబోయే ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన పాంచ్ న్యాయ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిఆర్ గౌస్ మాట్లాడుతూ గత 10 ఏళ్లుగా బిజెపి ఈ దేశంలోని యువతను, రైతులను, మహిళలను, శ్రామికులను, బడుగు బలహీన వర్గాలను దగా చేసి మతాల పేరు చెప్పి పబ్బం గడుపుకుంటోందన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రాంతీయ పార్టీలైన వైసిపి, టిడిపి వారి వ్యక్తిగత ఉనికిని చాటుకోవడానికి తాపత్రయపడ్డాయని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏనాడూ పోరాటం చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే దేశంలోని యువత కోసం ఖాళీగా ఉన్న ప్రతి ఉద్యోగాన్నీ భర్తీ చేస్తుందని, శ్రామికుల కోసం ప్రత్యేక ఆరోగ్య చట్టాన్ని తెస్తుందన్నారు. రైతుల కోసం ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సుల మేరకు కనీసం మద్దతు ధరను చట్టబద్ధత కల్పిస్తారన్నారు. మహిళల అభివద్ధి కోసం ప్రతి కుటుంబంలోని ఒక మహిళకు మహాలక్ష్మి పథకం ద్వారా లక్ష రూపాయలు కేటాయిస్తారన్నారు. ప్రజలు రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి రవి, ఒంగోలు నగర అధ్యక్షుడు రాయపాటి గిడ్యోన్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ అబ్దుల్ సుభాన్, దండుప్రోలు ప్రసాద్, కల్లూరు వెంకటేశ్వర్లు, బి. అనిల్ కుమార్, రాజు పాల్గొన్నారు.

దళిత విద్యార్థిపై దాడి చేసిన

లెక్చరర్‌పై కఠినచర్యలు తీసుకోవాలి

కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి మాల్యాద్రి

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ చదివే దళిత విద్యార్థి నవదీప్‌పై దాడి చేసిన కళాశాల డ్రాయింగ్ లెక్చరర్ బాలాజీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్రా మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఆదివారం బాపట్ల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థి నవదీప్‌ను పరామర్శించారు. మాల్యాద్రి మాట్లాడుతూ విద్యార్థిపై దాడి చేసిన లెక్చరర్ బాలాజీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. వెంటనే నిందితుడిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కళాశాలలో ఘటన జరిగితే దెబ్బలు తగిలిన అతనికి ఎటువంటి ప్రథమ చికిత్స చేయకుండా కళాశాల యాజమాన్యం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. నవదీప్‌కు తగిలిన గాయాలకు తోటి విద్యార్థులే ప్రాథమిక చికిత్స చేసి ఇంటికి తీసుకెళ్లిన పరిస్థితి అక్కడ నెలకొందన్నారు. పొరపాటున విద్యార్థికి ఏదైనా జరిగితే ప్రాణాలు పోయేవన్నారు. కళాశాల యాజమాన్యం వెంటనే బాధితుడిని పరామర్శించి న్యాయం చేయాలన్నారు. బాలాజీని కళాశాల నుండి సస్పెండ్ చేయాలని కోరారు. చికిత్స పొందుతున్న నవదీప్‌ను పరామర్శించిన వారిలో కెవిపిఎస్ బాపట్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శరత్, జయరాజ్ ఉన్నారు.

15వ డివిజన్‌లో దామచర్ల ప్రచారం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రచారంలో దామచర్ల జనార్ధన్

జనం కోసం జనార్ధన్ కార్యక్రమం ఒంగోలు నగరం 15వ డివిజన్‌లోని అన్నవరప్పాడులో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమం లో భాగంగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు ఇంటింటికి వెళ్లి మహిళలు, యువతతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు డివిజన్ లో సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందజేసి తెదేపా అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమం లో మంత్రి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరావు, క్లస్టర్ ఇంచార్జి బండారు మదన్, 15వ డివిజన్ పోగుల శివ ప్రసాద్, పొదిలి శ్రీనివాసరావు, పి హగ్గయ్యరాజు, గడ్డం మహేష్, లక్కవరపు అరుణ, జి. మల్లిబాబు, జనసేన పార్టీ నగర అధ్యక్షులు మలగా రమేష్, జనసేన- టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్లను ప్రలోభపెట్టే

బహుమతుల పంపిణీని అరికట్టాలి

కలెక్టర్ రంజిత్‌బాషా

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఓటర్లను ప్రలోభపెట్టే మద్యం, నగదు వంటి బహుమతుల పంపిణీని అరికట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. ఎన్నికల సీజర్ మేనేజ్మెంట్ విధానంపై ఎన్నికల నోడల్ అధికారులతో శుక్రవారం ఆయన తన చాంబర్లో సమావేశం నిర్వహించారు. నగదు, మద్యం, మాదక ద్రవ్యాలను అరికట్టడానికి నోడల్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి ఆదేశించారు. ముఖ్యంగా జిల్లా సరిహద్దులు, చెక్ పోస్ట్‌ల వద్ద ముమ్మర తనిఖీలు చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీముల తనిఖీలు మరింత పెరగాలన్నారు. ముందస్తు అనుమతులు లేకుండా రాజకీయ పార్టీలు, లేదా అభ్యర్థులు ఇంటింటా ప్రచారాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం విక్రయాలలో 30 శాతం పెరిగితే సంబంధిత దుకాణాలను గుర్తించి వాటిపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుండి అలాంటివి మూడు దుకాణాలు గుర్తించామన్నారు. వాటిపై విచారణ చేయాలన్నారు. నిబంధనల మేరకు విక్రయాలు జరుగుతున్నాయా.. లేదా.. అనే అంశాలపై నిఘా ఉంచాలన్నారు. గడిచిన ఆరు రోజుల్లో తొమ్మిది వేల లీటర్ల అక్రమ మద్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్పీ కలెక్టర్ దష్టికి తెచ్చారు. వాటి విలువ రూ.22.40 లక్షలు ఉన్నట్లు గుర్తించామన్నారు. మరో వైపు 450 కేజీల గంజాయి పట్టుకున్నామని కలెక్టర్‌కు వివరించారు.

ఎన్నికల సీజర్ మేనేజ్మెంట్ కమిటీ విధానం అనుబంధంగా పనిచేస్తున్న అధికారులంతా మరింత చురుగ్గా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి రంజిత్ బాషా తెలిపారు. అటవీశాఖ చెక్ పోస్టులు జిల్లాలో రెండు ఉండగా, వాటి వద్ద సంబంధితశాఖ అధికారుల పరిశీలన మరింత పెరగాలన్నారు. రైళ్లు, ఆర్టీసీ బస్సుల లో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. జిల్లాలోని 9 చెక్ పోస్టుల వద్ద నియమించిన ప్రత్యేక బృందాలు తనిఖీలు చేయాలన్నారు. అనుబంధ శాఖల నోడల్ అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే సీజర్ మేనేజ్మెంట్ విధానం అమలులో సత్ఫలితాలు ఉంటాయన్నారు. రాజకీయ పార్టీల ప్రచారాలు, సమావేశాలు, సభలు, ర్యాలీలపై వీడియో చిత్రీకరణ పక్కాగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రచారాలలో మద్యం, నగదు పూర్తి స్థాయిలో అరికట్టేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఇప్పటికే జిల్లా సరిహద్దులు, చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక బృందాలతో తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. పోలీస్ బలగాల పనితీరు, ఇప్పటికే సీజ్ చేసిన అంశాలపై కలెక్టర్ కు నివేదిక సమర్పించారు. ఆయా కమిటీల పని తీరును వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ విఠలేశ్వర రావు, జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, సీజర్ మేనేజ్మెంట్ నోడల్ అధికారి సైదానాయక్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, 17 శాఖల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠినచర్యలు

- ఇప్పటికే 9021 మంది బైండోవర్
- జిల్లాలో 332 పోలింగ్‌స్టేషన్లు సమస్యాత్మకంగా గుర్తింపు
- ఎస్పి వకుల్‌జిందాల్

మాట్లాడుతున్న ఎస్పి వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. కోడ్ ఉల్లంఘించిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. శుక్రవారం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఇప్పటివరకు సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తీసుకున్న చర్యలను గురించి ఎస్పీ వివరించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 137 లైసెన్సు తుపాకీలు ఉండగా వాటిలో 75ని ఇప్పటికే స్వాధీనం చేసుకున్నామన్నారు. మిగిలిన 62 బ్యాంకు అథారిటీల వద్ద ఉన్నాయని తెలిపారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ఆయుధాలు కలిగి ఉన్నా లేదా ప్రదర్శించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత సంవత్సరం అక్టోబర్ వరకు జిల్లాలో 178 నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉండగా తరువాత వివిధ కోర్టుల ద్వారా 330 వారెంట్లు రాగా వాటిలో ఇప్పటికే 503 వారెంట్లను ఎక్సిక్యూషన్ చేయటం జరిగిందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 919 ప్రాంతాల్లో 1510 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, వాటిలో 226 చోట్ల ఉన్న 332 పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మకంగా పరిగణించగా, మిగిలిన 657 ప్రాంతాల్లోని 1178 పోలింగ్ స్టేషన్లను సాధారణ పోలింగ్ స్టేషన్లుగా పరిగణించినట్లు పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ప్రజలు స్వేచ్ఛాయుతంగా వారి ఓటు హక్కును వినియోగించుకోవడానికి పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే బిఎస్ఎఫ్ దళాలతో కవాతు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్రమ నగదు, మద్యం, మాదక ద్రవ్యాలు, విలువైన లోహాలు, ఉచిత సామగ్రి పంపిణీ వంటి వాటి మీద ప్రత్యేక నిఘా ఉంచామని, వాటిని అదుపు చేయడానికి జిల్లా వ్యాప్తంగా 9 చెక్ పోస్ట్‌లను ఏర్పాటు చేశామని, వీటిని సమీప జిల్లాలైన పల్నాడు, గుంటూరు, ప్రకాశం సరిహద్దులలో, జిల్లా లోని ప్రధాన మార్గాలలో ఏర్పాటు చేశామన్నారు.

18 ఫ్లయింగ్ స్క్వాడ్ బందాలు

జిల్లాలో ఉన్న ఆరు నియోజకవర్గాల్లో మొత్తం 18 ఫ్లయింగ్ స్క్వాడ్ బందాలను, 29 ఎంసిసి బందాలను, 164 మంది సెక్టార్ అధికారులను నియమించామన్నారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సమన్వయంగా పనిచేస్తూ అనుక్షణం మోనిటరింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా సి విజల్ ద్వారా ఫిర్యాదు చేసిన లేక కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన తక్షణమే స్పందించేలా ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 18 స్టాటిక్ సర్వ్ లెన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కొక్క టీం లో 9 మంది చొప్పున 162 మంది రెవెన్యూ మరియు పోలీస్ అధికారులతో ఉమ్మడిగా నిరంతరం పనిచేసే విధంగా వీటిని ఏర్పాటు చేశామన్నారు. ఎలక్షన్ కోడ్‌కు వ్యతిరేకంగా నగదు పంపిణీ, అక్రమ మద్యం నిరోధించుటకు, ఇతర అసాంఘిక కార్యకలాపాలను అదుపులో ఉంచుట కొరకు ఈ టీములు పనిచేస్తాయని తెలిపారు.

ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా ఇప్పటికే సెక్షన్ 107 సిఆర్‌పిసి కింద 512 కేసులలో 7684 మందిని బైండోవర్ చేయడం జరిగిందని, అంతేకాకుండా గతంలో నేర ప్రవత్తి కలిగిన వారిని 346 కేసులలో 1337 మంది వ్యక్తులను మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ సమక్షంలో బైండోవర్ చేయడం జరిగిందన్నారు. బైండోవర్ చేసినప్పటికీ ఎవరైనా కోడ్ ఉల్లంఘన చేస్తే నియమావళి ప్రకారం నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. గత మూడు నెలల వ్యవధిలోనే పోలీస్ శాఖ, సెబ్ విభాగం సంయుక్త కార్యచరణతో పనిచేసి రూ.49,79,406 విలువ కలిగిన 12,799 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని 1,372 కేసులను నమోదు చేశామన్నారు. ఇప్పటివరకు రూ.24,95,500 విలువ కలిగిన 478 కేజీల గంజాయిని సీజ్ చేసి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా గంజాయి కలిగివున్నా, విక్రయిస్తున్నా, రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బెల్ట్‌షాప్‌ల నిర్వహణ, నాటు సారా అమ్మకాలు చేస్తే తీవ్ర నేరాలుగా పరిగణిస్తామని హెచ్చరించారు. గత 3 నెలలలో జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్ట్‌ల ద్వారా 2 కోట్లా 35 లక్షల రూపాయల నగదును సీజ్ చేసి ఐటీ శాఖకు అప్పగించడం జరిగిందన్నారు.